



# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 28-12-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 85 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### కోవిడ్ వల్ల తలెత్తే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

### కరోనా నివారణపై అధికారులతో సీఎం జగన్ సమీక్ష



అమరావతి: కోవిడ్ నివారణ, వైద్య ఆరోగ్యశాఖపై సీఎం జగన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. కోవిడ్ వల్ల తలెత్తే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులే కాకుండా ప్రైవేటు ఆస్పత్రులను కూడా కరోనా చికిత్సకు సిద్ధంగా ఉంచాలని, వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఫీవర్ సర్వే చేసే సమయంలోనే వ్యాక్సినేషన్ చేయించుకోనివారు ఎవరైనా ఉంటే.. వారందరికీ టీకాలు వేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం, ఏపీలో 6 ఒమిక్రాన్ కేసులు నమోదయ్యాయని అధికారులు సీఎంకు తెలిపారు. వారందరిని ప్రత్యేకంగా ఐసోలేషన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని.. రాష్ట్రంలో కేసులు తక్కువగా ఉన్నా.. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగుతున్నందున పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. టెస్ట్ ఎర్లీ, ట్రేస్‌ఎర్లీ, ట్రీట్ ఎర్లీ పద్ధతులలో పరీక్షలు నిర్వహించాలని సీఎం జగన్ సూచించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, పరిశీలన పటిష్టంగా కొనసాగాలన్నారు. సచివాలయం స్థాయి నుంచి అధికారులు డేటాను తెప్పించుకోవాలని తెలిపారు. దీనిపై వచ్చే వారం మరోసారి సమావేశమై పరిస్థితిని సమీక్షిద్దామని అధికారులతో సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రస్తుతం 13 జిల్లాల్లో 98.96 శాతం మొదటి డోస్ టీకాలు, 71.76 శాతం రెండో డోస్ టీకా వేసినట్లు ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. నెల్లూరు, విజయనగరం, ప్రకాశం, అనంతపురం, ప.గో, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో నూటికి నూరుశాతం మొదటి డోస్‌ను పూర్తి చేశారు. కడపలో 98.93, విశాఖపట్నం 98.04, గుంటూరు 97.58, తూ.గో 97.43, కృష్ణా 97.12, శ్రీకాకుళంలో 96.70 శాతం మేర మొదటి డోస్ వేశారు. కేంద్ర ప్రభుత్వం బూస్టర్ డోస్ ప్రకటన నేపథ్యంలో అన్నిరకాలుగా సిద్ధం కావాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు. ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌తోపాటు దీర్ఘకాలిక వ్యాధులున్నవారిపైన, వృద్ధులపైన బూస్టర్‌డోస్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్న సీఎం సూచించారు. 15 నుంచి 18 ఏళ్లవారితో కలుపుకుని దాదాపు 75 లక్షల మందికి బూస్టర్ డోస్ అవసరమున్నట్లు ప్రాథమికంగా అంచనావేశామని అధికారులు తెలిపారు. ఆర్టీపీసీఆర్ పద్ధతిలోనే కోవిడ్ గుర్తించే పరీక్షలు చేయాలని, విదేశాల నుంచి వచ్చేవారికి పరీక్షలతో పాటు

తరువాయి 2లో..



ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం హిమాచల్ ప్రదేశ్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఆయనకు త్రిశూలాన్ని బహూకరించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. దేశంలోని పంచ కైలాస పర్వతాల్లో.. మూడు హిమాచల్ ప్రదేశ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఈ రాష్ట్రంలో శివుడు శక్తి కొలువై ఉన్నారని చెప్పారు.

## టికెట్ రేట్ల వ్యవహారం.. మంత్రి పేర్ని నానితో భేటీ కానున్న డిస్ట్రిబ్యూటర్లు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సినిమా టికెట్ రేట్లను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. దీనిపై సినీ పరిశ్రమ వర్గాలతో పాటు, రాజకీయ నాయకులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. మరోవైపు ఏపీలో సరైన నిర్వహణ, అనుమతులు లేని థియేటర్‌లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తాము థియేటర్‌లను నడపలేమని పలువురు యజమానులు స్వచ్ఛందంగా సినిమా హాళ్లను మూసివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో చర్చలకు థియేటర్ యజమానులు, పంపిణీదారులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. టికెట్ రేట్ల తగ్గింపు వల్ల

తరువాయి 2లో..

## బ్రహ్మోస్.. భారత్‌పై కన్నెత్తే సాహసం చేయకుండా ఉండేందుకే..!

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



లఖ్‌నవూ: భారత్‌పై దాడి చేసేందుకు ఏ దేశమూ కన్నెత్తే సాహసము చేయకుండా ఉండేందుకే స్వదేశంలో బ్రహ్మోస్ క్షిపణి తయారు చేయాలను కుంటున్నామని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అంతేకానీ మరే దేశంపై దాడి చేసే ఉద్దేశంతో కాదని స్పష్టం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బ్రహ్మోస్ తయారీ కేంద్రంతోపాటు రక్షణ సాంకేతిక, ప్రయోగ కేంద్రానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి పాకిస్థాన్‌పై పరోక్షంగా విరుచుకుపడ్డారు. 'తాము తయారు చేస్తోన్న సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ (BrahMos)తోపాటు ఇతర అధునాతన రక్షణ ఆయుధాలు ఇతర

తరువాయి 2లో..

## ఆర్ఎస్ఎస్ సర్‌సంచాలక్ మోహన్ భగవత్ తో ఎంపీ విజయసాయి రెడ్డి



నరసాపురం (విజయభాను న్యూస్) : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంచాలక్ మోహన్ భగవత్‌ను వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఈ భేటీ జరిగింది. మోహన్ భగవత్ ఆశీర్వాదాలు తీసుకోవడం, ఆయన మార్గదర్శకమైన మాటలు వినడం తనకు లభించిన గొప్ప అవకాశం అని ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి అన్నారు.

## శ్రీవారి దర్శనం.. ఈ తేదీల్లో సిఫార్సు లేఖలు అనుమతించరు!

### - స్వయంగా వచ్చే ప్రముఖులకే బ్రేక్ దర్శనం - తితిదే కీలక నిర్ణయం

తిరుమల: సామాన్య భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి 1న, అలాగే, వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 13 నుంచి 22వ తేదీ వరకు స్వయంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించనున్నట్లు తెలిపింది. వారి సిఫార్సు లేఖల్ని స్వీకరించబోమని తితిదే అధికారులు స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు కొవిడ్ వ్యాక్సినేషన్ లేదా నెగెటివ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకొని రావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. శ్రీవారి ఆలయంలో జనవరి 13న వైకుంఠ ఏకాదశి, జనవరి 14న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా విచ్చేసే భక్తులకు

తరువాయి 2లో..






### స్పందన పిటిషన్లు పెండింగు లో ఉండటం పై

# జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వివిధ శాఖల అధికారుల వద్ద ఎస్.ఎల్.ఏ.(సర్వీస్ లేవల్ అగ్రిమెంట్) కాలపరిమితి దాటి స్పందన పిటిషన్లు పెండింగు లో ఉండటం పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కలక్టరు జిల్లా అధికారుల తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భముగా కలక్టరు జిల్లా అధికారుల వద్ద ఇంకను ఎస్.ఎల్.ఏ. పరిధి దాటి పెండింగులో ఉన్న స్పందన పిటిషన్ల పై వివరణ కోరారు. పోలీసు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ మరియు పలు ఇతర శాఖల అధికారుల వద్ద పెండింగు ధరఖాస్తులను పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై పెండింగు ఉన్నచో సోమవారం ఉదయం సంబంధిత అధికారి తనను కలిసి పెండెన్సీకి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. రి ఒపెనింగ్ కేసులు: ఒకసారి స్పందన లో క్లియర్ చేయబడిన ధరఖాస్తులు మరల రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు స్పందన లో వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి ధరఖాస్తు దారు సమస్యను అర్ధవంతముగా పరిష్కరించాలన్నారు. లేనిచో వాటిని ధరఖాస్తుదారులు మరల సమర్పించడం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని ప్రతి జిల్లా అధికారి సీరియస్ గా తీసుకుని తగు విధముగా స్పందించాలని ఆదేశించారు. ఈ రోజు స్పందన కార్యక్రమంలో 268 పిటషన్లు అందాయి. ఒ.టి.ఎస్ వలన అబ్దిదారులకు పలు రకాల ప్రయోజనాలు కలుగుతాయని, సంబంధిత అధికారులు వాటిని వివరించి తెలియపరచాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ల ను వేగవంతం గావించాలనిరెవెన్యూ అధికారుల ను ఆదేశించారు.కార్యక్రమాన్ని ఉగాది వరకు పొడిగించ బడిందన్నారు.

28 వ తేదీన పాయకరావుపేట లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించ బడుతుందని తెలియ జేశారు.

ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా అధికారులు పాయకరావుపేట నియోజక వర్గానికి సంబందించి పెండింగు అంశాలు, ధరఖాస్తులు, తీసుకున్న చర్యలు,, తదితర అంశాలపై నివేదికలు తయారు చేసుకుని హాజరు కావాలన్నారు.

**యాస్పిరేషన్ జిల్లాలు:** గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం క్రింద 5 అంశాల లో కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

హెల్త్, అగ్రికల్చర్, ఫైనాన్షియల్ ఇంక్లూజన్, స్కిల్ డెవలప్మెంట్ విభాగాల లో అభివృద్ధి సాధించాలని అన్నారు.ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్లు వేణు గోపాల్ రెడ్డి, అరుణ్ బాబు, కల్పనా కుమారి, డిఆర్ ఒ శ్రీ నివాసమూర్తి ఎస్.డి.సి.రంగయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భూగర్భ మురికినీటి కొరకు తీసిన గొయ్యిలను త్వరితగతిన పూరించండి

## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మిశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) :- భూగర్భ మురుగునీటి వ్యవస్థ, త్రాగునీటి కొరకు తీసిన గొయ్యిలను పని పూర్తి అయిన వెంటనే త్వరితగతిన పూడ్చాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మిశ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 6వ జోన్, 70 వార్డు పరిధిలోని లాల్ బహదూర్ శాస్త్రి నగర్, డ్రైవర్స్ కాలనీ, ఎల్.వి. నగర్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా యుజిడి, త్రాగునీటి కొరకు తీసిన గొయ్యిలను పూడ్చివేయాలని తడి-పొడి మరియు ప్రమాధకరమైన చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని వార్డు ప్రజలకు తెలియజేశారు. చెత్త తరలించే వాహనాలు సమయానికి వచ్చి చెత్త తరలించే విధంగా చర్యలు చేపట్టాలని, ఎల్.వి.నగర్ లో కడుతున్న అపార్ట్మెంట్ యాజమాన్యం భద్రతాపరమైన చర్యలు చేపట్టడం లేదని, వారికి నోటీసులు ఇచ్చి భద్రత చర్యలు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ వార్డులోని సమస్యలైన ఎల్.వి.నగర్ లో 11వ నెంబర్ రోడ్డు నూతనంగా నిర్మించాలని, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, ఎల్.వి. నగర్ నుండి ఆటో నగర్ కు నూతనంగా రోడ్డు నిర్మించాలని, దాని వలన ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, ఎల్.వి. నగర్, లక్ష్మీ నగర్ మధ్య గుండా గాజువాక మెయిన్ రోడ్డుకు 30 అడుగుల రోడ్డును అనుసంధానం చేయాలని, వీధి దీపాల నిర్వహణ సరిగాలేదని, త్రాగు నీరు సరిగా ఇవ్వడం లేదని, ద్రోణంరాజు సత్యనారాయణ కళ్యాణమండపం ఆధునీకరించాలని, వార్డులో పందులు అధికంగా ఉన్నాయని వాటిని నిర్మూలించాలని, గాజువాక ప్రధాన రహదారిలో స్కూలు పిల్లలు, వ్యాపారస్తులు, ప్రజలు రోడ్డును దాటుటకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు సులువుగా దాటే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకురాగా వార్డు అభివృద్ధి ప్రణాళికలో పైన చెప్పిన సమస్యలన్నీ ఉన్నాయని లేని వాటిని చేర్చి ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం జరుగు తుందని తెలిపారు. అనంతరం ద్రోణంరాజు సత్యనారాయణ కళ్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి. శాస్త్రి, జోనల్ కమిషనర్ శ్రీధర్, ఎఎంఒహెచ్ డాక్టర్ కిషోర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు ప్రసాద్ బాబు, వెంకటరావు, ఎసిపి రమణ మూర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## కాంక్రేట్ మిక్సర్ లారీ ఢీ కొని భార్యా భర్తలు మృతి...



కంచరపాలెం (విజయభాను న్యూస్) : కాంక్రేట్ మిక్సర్ లారీ డీ కొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఘటనకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి. సబ్బవరం గుల్లిపల్లి ప్రాంతానికి చెందిన కొల్లూరి నగేష్ (43) అతడి భార్య స్వర్ణ (35) సోమవారం ఎన్ .ఏడీ కూడలి జాతీయ రహదారి మీదుగా నగరం వైపు ద్విచక్ర వాహనం పై వెళ్తున్నారు. ఈక్రమంలో తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద కి వచ్చే సరికి కాంక్రేట్ మిక్సర్ లారీ డీ కొని భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. విశయం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫీక్ సి.ఐ కృష్ణరావు , ఎస్ .ఐ శ్రీనివాస్ పరిస్థితి సమీక్షించారు. మృత దేహలను కేజీ .హెచ్ కు తరలించి కంచరపాలెం పోలీసు లు దర్యాప్తు చేపట్టారు.

## భార్యను హత్య చేసిన భర్త ...



కంచరపాలెం(విజయభాను న్యూస్) : మద్యానికి బానిసైన భర్త బార్యను హత్య చేసిన ఘటన జీవీఎంసీ 53 వ వార్డు పరిధి శ్రీ హర్ష నగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబందించి ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ సి.ఐ సి.హెచ్ ఉమాకాంత్ సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ హర్ష నగర్ వద్ద నివాసముంటున్న రామయ్య ( 35 ) ఇంటస్టియల్ కూడలి వద్ద ఒక సంస్థలో వ్యాన్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు . మద్యానికి బానిసైన రామయ్య మద్యం మత్తులో నిత్యం బార్యను వేధించేవాడు. ఈక్రమంలో ఆదివారం మద్యానికి డబ్బులు కావలని భార్య నల్లి తోక గిరిజ ( 29 ) తో గొడవ పడ్డాడు . బార్య డబ్బులు ఇవ్వకపోవటంతో ఇంట్లో ఉన్న చున్నీతో ఆమే గొంతు నులిమి ఆతమర్చాడు . స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న ఎయిర్ పోర్టు పోలీసు లు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు . హతుడు రామయ్య ను అదుపులోకి తీసుకుని మృతదేహన్ని కేజీ .హెచ్ కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు .

## పాడైపోయిన హెచ్‌టి, ఎల్‌టి వైర్లు స్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు

ములగాడ : శ్రీహరిపురం ఏపీ ఇ పి డి సి ఎల్ విద్యుత్ ప్రాంతీయ ఉపకార్యాలయం పరిధిలో మంగళవారం మెయిన్ రోడ్లో లిఖిత థియేటర్ ఏరియాలలో పూర్తిగా పాడైపోయిన హెచ్ టి, ఎల్ టి వైర్లు స్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనవల్ల ఉదయం 09:30 గంటల నుండి 03:30 గంటల వరకు శ్రీనివాస నగర్, దుర్గా బార్ ఏరియా, కుంచమాంబ కాలనీ, గుల్లలపాలెం,రామ్ నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయాబడునని జోన్ -2 డి ఇ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా సోమవారం తెలియజేసారు. వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

## ప్రజల ఆరోగ్యం పట్ల కేంద్రం నిర్లక్ష్యం



గాజువాక : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష 319 వ రోజుకు చేరుకుంది. సోమవారం నిర్వహించిన రిలే దీక్ష లో విశాఖ ఉక్కు కర్మాగారం ట్రాఫిక్ విభాగం నుంచి పాల్గొన్న ప్రతినిధులు కార్యకర్తలను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధి డి ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈనాడు ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కోవిడ్ మహమ్మారి విజృంభించడంతో అనేకమంది మన సహచరులను మనం కోల్పోయామని ఆయన అన్నారు. దీనికి ప్రధాన కారణం వారికి ఆక్సిజన్ను అందించడం గాని, సకాలంలో వైద్యం అందించడంలో వైఫల్యం జరిగింది అన్న నిపుణుల నివేదికలు చూపుతున్నాయని ఆయన వివరించారు. వైద్యం ప్రైవేటు వారి కనుసన్నలలో ఉండడం వల్లే ప్రజలు తమ ప్రాణాలు నిలుపుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. నేడు ఓమిక్రాన్ వేరియంట్ విజృంభిస్తోంది అన్న ప్రభుత్వ ఆదేశాలతో ప్రజలు మరిన్ని భయాందోళలకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. ప్రజలకు ఆక్సిజన్ అందించడంలో విశాఖ ఉక్కు కర్మాగారం ముఖ్యమైన భూమికను పోషించింది అని ఆయన గుర్తు చేశారు. కానీ ప్రైవేటు వారు దీనిని ఆసరాగా తీసుకుని అనేక లక్షల కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆయన అన్నారు. కనుక ఈ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలతోనే ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు.

దీక్షా శిబిరంలో ట్రాఫిక్ విభాగం ప్రతినిధులు పి వి రమణ, ఎమ్. త్రిమూర్తులు, టి భాస్కర్, ఎస్ పాపా రావు, ఎస్ గోవిందరావు, జి శ్రీనివాస్, ఎస్ బాబు రావు, కారు రమణ, అప్పారావు తదితరులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 58వ వార్డ్ ను ఆదర్శ వార్డ్ గా తీర్చుదిద్దుతా



ములగాడ : జీవీఎంసీ 58వ వార్డ్ ను ఆదర్శ వార్డ్ గా తీర్చు దిద్దుతనని 58 వార్డ్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, టౌన్ ప్లానింగ్ చైర్మన్ గులిగిందాల లావణ్య పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ 58వ వార్డ్ పరిధిలోని గుల్లలపాలెం ప్రధాన గెడ్డను ప్రజల కోరిక మేరకు జీవీఎంసీ సానిటరీ సిబ్బంది జెసిబి తో పూడికతీత చేసారు. ఈ పనులను పరిశీలించిన ఆమె అనంతరం మాట్లాడుతూ వార్డ్ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు తెలియజేసారు. ఈ. కార్యక్రమం వార్డ్ అధ్యక్షులు గులిగిందాల కృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, జగన్నాధం, జగన్, సురేష్, కన్నబాబు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

వారిని ట్రేస్ చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పర్యటకులను రెగ్యులర్‌గా పరీక్షలు జరపాలన్న సీఎం జగన్.. పాజిటివ్ అని తేలితే ప్రైమరీ కాంటాక్ట్స్‌కు కూడా వెంటనే ట్రెసింగ్ చేయాలన్నారు. అదే విధంగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు -నేడు పనుల ప్రగతిని సీఎం జగన్ సమీక్షించారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇవి పూర్తికాగానే అత్యాధునిక వసతి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని సీఎం జగన్ పేర్కొన్నారు.

ఈ క్రమంలో.. మెడికల్ సీట్లు పెరగడమే కాదు.. మంచి వైద్యంకూడా అందుబాటులోకి వస్తుందన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఒకవైపు నాడు-నేడు ద్వారా ఇప్పుడున్న ఆస్పత్రులను ఆధునీకరించడం, ఇప్పటికే ఉన్న 11 బోధనాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు, ఈ కొత్త మెడికల్‌కాలేజీల నిర్మాణాలనూ ముందుకు తీసుకెళ్లాలని సీఎం అధికారులను సూచించారు. మెడికల్ హబ్స్ ఏర్పాటు ప్రగతిపైనా అధికారులతో చర్చించారు. వీలైనంత త్వరగా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రైవేటు రంగంలో కూడా అత్యాధునిక వైద్య సదుపాయాలు రావాలన్నదే ఈ హబ్స్ ముఖ్య ఉద్దేశమని సీఎం జగన్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఆస్పత్రిలో అవసరమైన సిబ్బందిని కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసుకోవాలని సీఎం జగన్ అధికారులను సూచించారు.

### బ్రహ్మోస్.. భారత్‌పై కన్నెత్తేసాహసం చేయకుండా ఉండేందుకే..!

దేశాలపై దాడి చేసేందుకు కాదు. ఇతర దేశాలపై దాడి చేయడం లేదా ఇతర దేశం నుంచి ఇంచు భూమి కూడా లాక్కునే స్వభావం భారత్‌కు ఎన్నడూ లేదు' అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. బ్రహ్మోస్ క్షిపణిని భారత్ గడ్డపైనే తయారు చేయాలనుకుంటున్నామని పేర్కొన్న ఆయన.. తద్వారా చెడు ఉద్దేశంతో ఎవ్వరూ భారత్‌పై కన్నెత్తి చూసే సాహసం చేయలేరని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. భారత్‌పై ఆ దేశం ఎందుకు విరోధం కోరుకుంటుందో తెలియదన్నారు. 'పొరుగు దేశం ఒకటుంది. కొంతకాలం క్రితం భారత్ నుంచి విడిపోయింది. ఎందుకో తెలియదు కానీ భారత్ పట్ల ఆ దేశానికి ఎల్లప్పుడూ చెడు ఉద్దేశాలే ఉంటాయి. ఊరీ, పుల్వామాల్లో ఉగ్రవాద చర్యలకు పాల్పడింది. అటువంటి సందర్భంలోనే ప్రధాని మోదీ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దేశం భూభాగంలోకి అడుగుపెట్టి ఉగ్రవాద స్థావరాలను నాశనం చేశాం. ఆ సమయంలో ఎయిర్‌స్ట్రైక్ అవసరం కావడంతో దాన్ని కూడా విజయవంతంగా పూర్తిచేశాం. అలా ఎవరైనా మనమీద దురుద్దేశంతో ఏదైనా చేసేందుకు సాహసిస్తే.. కేవలం మన ప్రాంతం నుంచే కాకుండా వారి భూభాగంలోకి ప్రవేశించి దాడిచేస్తామనే హెచ్చరిక ఇచ్చాం. ఇదే భారత్ బలం' అని పరోక్షంగా ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ నిప్పులు చెరిగారు. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్.. దేశ రక్షణను తేలికగా తీసుకోమని స్పష్టం చేశారు. తొలుత ఎవ్వర్నీ రెచ్చగొట్టమని, అదే సమయంలో ఎవరైనా మనదేశాన్ని రెచ్చగొడితే అటువంటి వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.

### టికెట్ రేట్ల వ్యవహారం.. మంత్రి పేర్ని నానితో భేటీకానున్న డిస్ట్రిబ్యూటర్లు

తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి పేర్ని నాని దృష్టికి తీసుకెళ్లేందుకు సమయాత్తమయ్యారు. ఇప్పటికే ఈ విషయమై మంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా కోరగా, కేవలం డిస్ట్రిబ్యూటర్స్‌తో మాత్రమే మాట్లాడేందుకు మంత్రి ఓకే చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు 20మంది డిస్ట్రిబ్యూటర్లు మంత్రిని కలిసేందుకు అనుమతి లభించింది. ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిస్ట్రిబ్యూటర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. సినిమా టికెట్ రేట్లపై పలువురు సినీ హీరోలు, నిర్మాతల వ్యాఖ్యలతో తాము ఇబ్బంది పడుతున్నట్లు థియేటర్ యజమానులు, పంపిణీదారులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లతో థియేటర్లు నడపలేమని, దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరనున్నారు.

### శ్రీవారి దర్శనం.. ఈ తేదీల్లో సిఫార్సు లేఖలు అనుమతించరు!

కొవిడ్‌నిబంధనలు పాటిస్తూ సంతృప్తికరమైన దర్శనం కల్పించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. ఈ పర్వదినాల నేపథ్యంలో జనవరి 13 నుండి 22వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నారు.

గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ రద్దు

- జనవరి 11 నుంచి 14వ తేదీ వరకు వసతి గదుల అడ్వాన్స్ రిజర్వేషన్‌ను రద్దు చేశారు.
- శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తుల వసతికి పెద్దపీట వేస్తూ తిరుమలలోని అన్ని గదులను కరెంటు బుకింగ్ ద్వారా కేటాయించాలని నిర్ణయించారు.
- జనవరి 11 నుంచి 14వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ప్రివిలేజ్ ఉండదు.

కల్యాణకట్ట: తలనీలాలు తీసేందుకు తగినంత మంది క్షురకులను అందుబాటులో ఉంచారు. కొవిడ్-19 నిబంధనలు పాటిస్తూ క్షురకులు పీపీఈ కిట్లు వినియోగిస్తారు.

అన్నప్రసాదం: అన్నప్రసాద భవనంలో కోవిడ్-19 నిబంధనలు పాటిస్తూ ఈ 10 రోజుల పాటు ఉదయం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుంది.

వైద్యం: భక్తులకు వైద్యసేవలందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయి.

పార్కింగ్: తిరుమలలో పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలు పార్కింగ్ ప్రాంతాలకు చేరేలా ఏర్పాట్లు చేశారు.

కొవిడ్ నిబంధనలు: కొవిడ్ వ్యాక్సినేషన్ లేదా నెగెటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి. ఒమిక్రాన్ దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న వేళ ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలుజారీచేశాయి. అదే విధంగా, కొన్ని పట్టణాల్లో రాత్రి కర్ఫ్యూ కూడా విధించారు. ఈ నేపథ్యంలో భక్తులు పర్వదినాల్లోనే కాకుండా మిగతా అన్ని రోజుల్లోనూ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ గానీ, దర్శనానికి 48 గంటల ముందు చేసుకున్న ఆర్టీపీసీఆర్ పరీక్ష నెగెటివ్ సర్టిఫికెట్ గానీ తప్పనిసరిగా తీసుకురావాలి. తితిదే సిబ్బంది, వేలాది మంది భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా బాలశౌరి తనయుడి వివాహ వేడుక.. హాజరైన చిరు



మచిలీపట్నం : పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తనయుడు అనుదీప్ వివాహం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా జరిగింది. సోమవారం తెల్లవారుజామున వధువు స్నికితను అనుదీప్ పరిణయమాడారు. రెండు రోజులు పాటు ఘనంగా జరిగిన వేడుకలలో భాగంగా సంగీత్, హల్దీ, పెండ్లి కొడుకు, పెళ్లి కూతురు రిసెప్షన్‌తో పాటు ఇతర వేడుకలు రంగ రంగ వైభవంగా జరిగాయి. ఈ పెళ్లి వేడుకలో సినీ, రాజకీయ, వ్యాపార వేత్తలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అగ్ర కథానాయకుడు చిరంజీవి దంపతులు పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశ్వీరదించారు.

# ప్రాథమిక పాఠశాలలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ



వి.మాడుగుల (విజయభాను న్యూస్) మండలంలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ విధానం ద్వారా ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులను కలిపి విద్యను బోధించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి బి దేవుడమ్మ తెలిపారు. ఈ విధానాన్ని మండలంలో ఎం కోడూరు, వీర నారాయణం,వమ్మలి, గాది రాయి గ్రామాలలో నూతనంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలో అదనంగా ఉన్న ఉపాధ్యాయ నేను వేరే పాఠశాలలో నియమించడం జరిగిందన్నారు.

# పరిశ్రమల అనుసంధానంతో పనిచేస్తాం

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



రాంకీ సంస్థ ఎం.డి లాల్ క్రిష్ణతో చర్చిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ(విజయభాను న్యూస్) : పరిశ్రమల అనుసంధానంతో పనిచేస్తూ యువతకు మార్గనిర్ధేశం చేయడం జరుగుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ఆయన రాంకీ ఫార్మ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.లాల్ క్రిష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూలో ఫార్మరంగ పరిశ్రమలకు ఉపయుక్తంగా ఫార్మ టెస్టింగ్ లాబ్ ఏర్పాటు చేస్తున్న విధానాన్ని వివరించారు. దీనిలో పరిశ్రమల భాగస్వామ్యం, అనుసంధానం, సంయుక్త పరిశోధనలు జరపడం జరుగుతుందన్నారు. ఫార్మ టెస్టింగ్ ల్యాబ్‌లో నెలకొల్పే సాంకేతిక పరికరాలు, మౌళిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. అందరికీ ఉపయుక్తంగా ఈ ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫార్మటెస్టింగ్, ఫుడ్ టెస్టింగ్,జెనిటిక్ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు చేస్తున్న విధానం వివరించారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం రాంకీ ఫార్మ సిటీ ఎండి లాల్ క్రిష్ణ ఏయూ అధికారులతో కలసి నూతనంగా నిర్మతమవుతున్న ల్యాబరేటరీల భవన నిర్మాణం, ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.వి రవీంద్రనాథ్ బాబు, ఓఎస్‌డి ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆర్అండ్‌డి డీన్ ఆచార్య కె.బసవయ్య, ఫార్మశీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె. వి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఒటియస్ పై ధర్నాకు బయలుదేరిన టీడీపీ శ్రేణులు



పరవాడ (విజయభాను న్యూస్) : : పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో లోకార్యకర్తలు ఓ టి ఎస్ మీద కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమానికి బయలుదేరి వెళ్ళారు. అనంతరము మాజీ మంత్రి బండారు మాట్లడుతూ వన్ టైం సెటిల్ మెంట్ క్రింద డబ్బులు కట్టమనడం దుర్మార్గం అన్నారు.ప్రజలు ఎవ్వరు డబ్బులు కట్టరాదు అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధరావు, వియ్యపు చిన్నా (మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు), బొండా సన్ని దేవుడు (పార్లమెంట్ ఉపాధ్యక్షులు) ,ఇంథల కొండలరావు (మండల ప్రధాన కార్యదర్శి), రొంగలి గోపాలకృష్ణ (టిఎన్ టియుసి అధ్యక్షులు) ,గోర్లి శ్రీనివాసు మాజీ ఎంపిటిసి, పైలా చినఅక్కునాయుడు,పైలా రామచంద్ర రావు, జనపాల రాము, గొంప మారు నాయుడు, చింత కాయల రవి,బండారు వీరు నాయుడు,, కాకినాడఅప్పారావు, గండి మహేష్, చింత కాయల సతీశ్, కార్య కర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు డాబా ప్రారంభం

## స్వాములకు భవనాలకు ఉచితంగా భోజనం



సబ్బవరం (విజయభాను న్యూస్): సబ్బవరం మండలం లోని గోటివాడ గ్రామంలో దామోదర సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఎదురుగా సోమవారం నూతనంగా సి ఎస్ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు డాబా ప్రారంభోత్సవం జరిగింది. ఈ ఫ్యామిలీ రెస్టారెంట్ ను వడిశల లక్ష్మణ, పి చంద్ర మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ విలేకరులతో మాట్లాడుతూ రుచికరమైన నాణ్యమైన పదార్థాలను అందరికీ అందుబాటులో ఉండే ధరలో తక్కువ ధరలతో భోజన సదుపాయం కల్పిస్తామని అన్నారు. అంతేకాకుండా ఇండియన్ చైనీస్ తండూరి మా ప్రత్యేకత అన్నారు. మరియు వివాహకార్యక్రమాలకు ,పుట్టిన రోజులకు, అతి తక్కువ ధరలతో రుచికరమైన వంటలతో క్యాటరింగ్ చేయబడును అని తెలిపారు. అలాగే స్వామీలకి, భవనాలకు ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని అన్నారు. సబ్బవరం మండలం చుట్టుపక్క గ్రామాల ప్రజలు అందరూ మా ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ డాబా వ్యాపార అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బోండా సత్యారావు,గోటివాడ గ్రామ మాజీ సర్పంచ్ వడిసెల రమేష్, సాలాపు వెంకటేశ్వరరావు, సాలాపు సూరిబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# ఫాబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ వితరణ

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ పిల్లలకు ఆన్లైన్ క్లాసులకోసం రూ. 20 వేలు గల కంప్యూటర్ ని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్) ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఫాబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ పిల్లలు ఈ కంప్యూటర్ ని చక్కగా ఉపయోగించుకొని కొత్త విషయాలను నేర్చుకోవాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఇటువంటి ట్రస్ట్ లకు సహాయం చేయాలని కోరారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫాబ్ ప్రతినిధులు ప్రశాంత్ కుమార్ మాదే, సన్నీ కాళ్ళ, సూర్య శ్రీనివాస్ ముసునూరి, డాక్టర్ లావణ్య కాళ్ళ, మన కుటుంబం వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆలోచనలతో పనిచేసే శక్తి యువత సొంతం

## స్టీల్ ప్లాంట్ సిఎండి అతుల్ భట్



స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ (విజయభాను న్యూస్) : నూతన ఆలోచనలతో పనిచేసే శక్తి యువత సొంతమని విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్ అన్నారు. సోమవారం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎండి అతుల్ భట్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలు, సమస్యలను గుర్తించి పరిష్కారం చూపే దిశగా పనిచేయడం యువత సొంతమన్నారు. యువతను ప్రోత్సహించే దిశగా హ్యాక్‌థాన్‌ను సైతం నిర్వహించామని తెలిపారు. తాను వివిధ ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసిన విధానం, పనితీరు. ప్రగతి సాధించడానికి ఉపయుక్తమైన అంశాలను వివరించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలసి పనిచేస్తామన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ యువతను ప్రోత్సహిస్తూ, మార్గదర్శకం అందించే విధంగా స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ రంగాలలో యువతను నిష్ణాతులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయంలో ఏయూలో నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పామని తెలిపారు. ఏయూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం అందించే విధంగా ఇంటర్న్‌షిప్‌లు అందించాలని, ఏయూలో ఆర్ఐఎన్ఎల్ చెయిర్ ప్రొఫెసర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పాలక మండలి సభ్యులు ఆచార్య టి.శోభశ్రీ, ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.వి రవీంద్రనాథ్ బాబు, ఓఎస్‌డి ఆచార్య వి.క్రిష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, పేరి శ్రీనివాస రావు, ఎస్.కె భట్టి, ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ ఆచార్య హెచ్.పురుషోత్తం, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, ఆర్ఐఎన్ఎల్‌జిఎం డాక్టర్ ఓ.ఆర్.ఎం రావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం స్టీల్‌ప్లాంట్ సీఎండి ఆంధ్రవిశ్వ విద్యాలయం కామర్స్‌మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధక విద్యార్థిగా ప్రవేశం పొందారు. ప్రవేశ పత్రాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా అతుల్‌భట్‌ను ఏయూ తరపున సత్కరించారు.

# ఐటీడీఏ పీవో ను కలిసిన శిక్షణ ఐఏఎస్ బృందం



పాడేరు (విజయభాను న్యూస్) : 27 భారత్ దర్శన్ లో భాగంగా రెండు రోజుల నుంచి ఏజెన్సీ లో పర్యటిస్తున్న 2020 బ్యాచ్ కి చెందిన 14 మంది ఐఏఎస్ అధికారుల బృందం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో గిరిజన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. విద్య వైద్య రంగాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన హేబిటేషన్ సర్వే ,జనాభా ఏజెన్సీ లో ఉన్న గిరిజన తెగల జీవన విధానం పై వివరించారు. కాఫీ సాగు కాఫీ రైతులకు మార్క్స్, గిరిజన సహకార సంస్థ ద్వారా అందిస్తున్న గిట్టుబాటు ధరల గురించి తెలియజేశారు. గిరిజనులకు మెరుగైన వైద్యం నాణ్యమైన విద్య రవాణా రహదారి సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కి గల అధికారాలను తెలియజేశారు. ఆంధ్ర ఉటీగా విశాఖ మన్యం ప్రసిద్ధి కెక్కిందని అన్నారు. పాడేరు మండలం వంజంగి చింతపల్లి మండలం తాజంగి లంబసింగి, అరకు వేలి, డుంబ్రిగుడ, జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం మండలం కొల్లాపుటు తదితర పర్యాటక ప్రాంతాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి అభిషేక్ 14 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి పూజకు జీసీసీ పసుపు

## జీసీసీ చైర్ పర్సన్ శోభా స్వాతీరాణి



అనంతగిరి (విజయభాను న్యూస్) : తిరుమల పర్యటనలో భాగంగా టీటీడీలో గిరిజన కార్పొరేషన్ (జిసిసి) ఉత్పత్తులకు అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కోరినట్లుగా జిసిసి చైర్ పర్సన్ శోభ స్వాతి రాణి తెలిపారు. స్పందించిన ఆయన మొదటిగా స్వామి సేవకు జిసిసి తేనె కావాలని అడుగగా సుమారు 1800 కేజీలు తేనె పంపినట్లు చెప్పారు. అదేవిధంగా ఇప్పుడు సుమారు రెండు వేల కేజీల పసుపు సరఫరా చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో పంపించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆమె చెప్పారు. దీంతో జిసిసి బలోపేతం తో పాటు గిరిజనుల అభివృద్ధికి దోహదపడుతుందని ఆమె అన్నారు. స్వామివారి సేవకు, నిత్య అన్నదానానికి ఈ పసుపు వినియోగించనున్నట్లు చెప్పారు.

# జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు నగర క్రీడాకారులు



గాజువాక (విజయభాను న్యూస్) :మహారాష్ట్ర పూనేలో రేపటి నుండి డిశంబరు 30వరకు జరగబోయే జాతీయ స్థాయి కిక్ భాక్సింగ్ పోటీలకు ఆంధ్రరాష్ట్రం నుండి 16 మంది క్రీడాకారులు సోమవారం నగరం నుండి బయలుదేరి వెల్లారు. వారికి రాష్ట్ర కిక్ భాక్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి నరసింగరావు కిట్లు అందజేసి అభినందించారు. పోటీలలో గెలుపొంది మన రాష్ట్రానికి మన జిల్లాకి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ ఆనందబాలు,రిఫరీ ఉమామహేశ్వరరావు,టీం మేనేజర్ రామారెడ్డి,సీనియర్ కోచ్ సునీల్ ,బాటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసులు దాడి



పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులతో పాటు నగదును పట్టుకున్నామని మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఐదుగురు వ్యక్తులతో పాటు ఎనిమిది బైకులు, ఐదు సెల్‌ఫోన్లు, 59,270 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## భాషా నైపుణ్యాలపైనే దృష్టి

ఈ మధ్య ఒక వీడియో వైరలయింది. అందులో ఆరేండ్ల వయస్సు పాప తన వయస్సు వారికి, ఇతర పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు ఒకటి తరువాత ఒకటి సబ్జెక్టులు గుప్పిస్తుంటే ఎంత కష్టంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి చక్కగా వివరించింది. నిజానికి ఆమె ముద్దు మాటల్లో మన విద్యావ్యవస్థలో ఉన్న లోపాలు, చేయవలసిన మార్పులు తెలుస్తున్నాయి.

భాష నేర్చుకోవటం, సాంకేతిక అంశాలు నేర్చుకోవటం కంటే భిన్నంగా ఉంటుంది. దానికి హృదయ స్పందన అవసరమవుతుంది. ఇది పాఠశాల స్థాయిలోనే ఎదుగుతున్న వయస్సు వారికి అబ్బుతుంది. 14 సంవత్సరాల తర్వాత భాషలు నేర్చుకోవటం కష్టమవుతుందని పరిశోధనలు నిరూపించాయి.

మన దేశం ఒకే భాషా సంస్కృతుల వ్యవస్థ కాదు. శతాబ్దాల తరబడి వివిధ రాజ్యాలుగా ఉండి, వివిధ భాషలు, సంస్కృతులు, విదేశీ దండయాత్రల ఫలితంగా వివిధ మతాలు ఏర్పడిన వైవిధ్యభరిత ఉపఖండం. ఇంగ్లీషు ద్వారా బోధన మొదలైన తరువాత 1947 దాకా రాజకీయ కారణాలతో ప్రాంతీయ భాషలను కొంతవరకు నిర్లక్ష్యం చేయటం జరిగింది. అయితే విద్య అందరికీ అందించటంలో విఫలమైన (స్వాతంత్ర్యానంతరం కూడా) ప్రభుత్వాల వల్ల ఈ భాషలకు మేలు జరిగి, ఇంకా వాడుక భాషలుగానే ఉన్నాయి. కానీ ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోని విద్యావేత్తల వల్ల సమాజంలో చాలా ప్రతికూలతలు, వైరుధ్యాలు పెరిగాయి. భాషల ఔన్నత్యంపై అవగాహన ఉన్న విద్యావేత్తలు ఈ డబ్బు ఏండ్లుగా మొత్తుకుంటున్నా భాషా బోధన మెరుగుపడలేదు, భాషా విధానాన్ని సరిగా రూపొందించలేదు. ఈ వైఫల్యం వ్యాసం మొదట్లో చెప్పిన పాప వీడియోలో తేటతెల్లమైంది. నిజానికి కొవిడ్ మహమ్మారి చాలా విషయాల్లో మన కళ్ళు తెరిపించింది. ఈ ఏడాది కాలం ఆన్‌లైన్ టీచింగ్‌తో మనం పాఠశాల విద్యార్థులను ఎలా తీర్చిదిద్దగలిగి ఉండవచ్చో విశ్లేషిద్దాం!

మన దేశంలో ప్రతి విద్యార్థి ఎదుర్కొనే సమస్య భాషా నైపుణ్యాలు. ప్రపంచ భాష అయిన ఇంగ్లీషు తప్పనిసరిగా నేర్చుకోవలసినదే. దానికి తోడు దేశ భాష నేర్చుకోవాలి. అయితే దేశంలో చాలామందికి ఎందుకూ పనికిరాని హిందీని రాష్ట్ర భాషగా నిర్ణయించటం వల్ల విద్యావ్యవస్థ మీదే కాక చిన్నపిల్లల వ్యక్తిత్వ వికాసం మీద కూడా దెబ్బ పడింది. దాని బదులు సంస్కృతం, ఉర్దూ భాషలను రాష్ట్ర భాషలుగా గుర్తించి వాటిలో ఒకటి, ఇంగ్లిషు, మాతృభాషలను త్రిభాషా సూత్రంలో చేర్చి ఉంటే ఇంత గందరగోళ పరిస్థితి ఉండేది కాదు. ఎందుకంటే ఉర్దూ మాతృభాష అయినవారు మూడో భాషను ఎన్నుకోవచ్చు. అది పర్షియన్ గానీ, అరెబిక్ గానీ అవ్వచ్చు. ఇతర భారతీయ భాషలన్నీ సంస్కృతం నుంచి పుట్టినవే గనుక వారికీ సులభమయ్యేది. పైగా పాఠశాల స్థాయిలో సంస్కృతం నేర్చుకోవడం వల్ల ముఖ్యమైన లాభాలు రెండున్నాయి. ఒకటి సంస్కృత భాష నేర్పినప్పుడు కూడా పిల్లల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలే ఉంటాయి.

ఉదాహరణకు పంచతంత్ర కథలలో నీతి, నిజాయితీ, త్యాగం, మంచితనం, ధైర్యం, సమాజ స్పృహ ఉంటాయి. మోసం, అసత్య ప్రవర్తన, చెడు మొదలైన వాటిని ఎట్లా రూపుమాపాలి వంటి అంశాలు ఉంటాయి. వీటిని చదువడం వల్ల పిల్లల వ్యక్తిత్వం అలవోకగా ఎదుగుతుంది. మంచీ-చెడూ, ధర్మం-అధర్మం, నీతి-అవినీతి మధ్యనున్న వ్యత్యాసం అర్థం చేసుకోవటమే కాక మంచి వ్యక్తులుగా వారిని రూపుదిద్దుకునేట్టు చేస్తాయి ఈ కథలు. ఇంకా సుభాషితాలు ఒక్కో పద్యం ఒక్కో రత్నం. అయితే వీటిని పాఠశాల స్థాయిలో చెప్పాలంటే భాషా నైపుణ్యాల బోధన మీద కూడా దృష్టి ఉండాలి. ఇది జరిగితే పిల్లలు తమ సంస్కృతిని అవగాహన చేసుకుంటారు. ఇంగ్లీష్ మీడియంలోనే చదువుకున్న తమిళ, మలయాళ విద్యార్థులకు, తెలుగు విద్యార్థులకు ఉండే వ్యత్యాసం చూస్తే ఈ విష యం అర్థమవుతుంది.

# 'డయల్ యువర్ మేయర్' కార్యక్రమం నిర్వహించిన మేయర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : డయల్ యువర్ మేయర్ కార్యక్రమంనకు 28 ఫోన్ కాల్స్ వచ్చాయని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశతో కలసి ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరం నందు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-4250-0009 ద్వారా డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరింగ్ విభాగమునకు 12, పట్టణ ప్రణాళికా విభాగమునకు 06, పబ్లిక్ హెల్త్ విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 07, మొత్తము 28 ఫిర్యాదులు ఫోను ద్వారా స్వీకరించారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన మేయర్ ఉన్నతాధికారులతోను, జోనల్ కమిషనర్లతోను మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, అదనపు కమిషనర్(ఇంచార్జ్)/జె.డి.(అమ్రిత్) విజయ భారతి, ఎక్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, డి.సి.ఆర్.నల్లనయ్య, ఎ.డి.(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, డిప్యూటీ సి.పి. రాంబాబు, డి.పి.ఓలు తదితరులు పాల్గొన్నారు.

# కొవిడ్ సోకిన ఏడు నెలల వరకు శరీరంలోనే వైరస్ !

## వెల్లడించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనం



వాషింగ్టన్: కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ ప్రపంచాన్ని చుట్టేస్తున్న తరుణంలో మరో విషయం వెలుగులోకి వచ్చింది. కరోనా వైరస్ ఒక్కసారి సోకితే అది నెలలపాటు ఒంట్లోనే ఉండి వివిధ శరీర భాగాలపై ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఓ అధ్యయనం చేపట్టారు. కాగా కరోనా సోకినప్పటినుంచి ఏకంగా 230 రోజులపాటు (ఏడున్నర నెలలు) వైరస్ మానవ శరీరంలో ఉంటున్నట్లు గుర్తించారు. శరీరంలోని పలు అవయవాలు సహా మెదడులోనూ దీన్ని గుర్తించినట్లు వెల్లడించారు. లక్షణం లేనివారు, తేలికపాటి లక్షణాలు ఉన్నవారిలోనూ అదే స్థాయిలో వైరస్ ఉన్నట్లు పేర్కొన్నారు. వైరస్ లోడు అత్యధికంగా శ్వాసకోశంలో (97.7 శాతం) గుర్తించినట్లు అధ్యయనం వెల్లడించింది. ఆ తర్వాత గుండె రక్తనాళ కణజాలం, లింఫోయిడ్, జీర్ణశయాంతర కణజాలాలు, మూత్రపిండం, ఎండోక్రైన్ కణజాలంలో గుర్తించినట్లు తెలిపింది. పునరుత్పత్తి కణజాలం, కండరాలు, చర్మం, కొవ్వులోనూ వైరస్ ఉండటాన్ని కనుగొన్నట్లు వివరించింది. మెదడు కణజాలంలోనూ ఏడు నెలలపాటు ఉంటోందని పేర్కొంది. పలు అవయవాలపై దాడి చేస్తోందని చెప్పిన శాస్త్రవేత్తలు.. ఊపిరితిత్తులపై మాత్రం ఎలాంటి ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించలేదని చెప్పారు. కొవిడ్ సోకి మృతిచెందిన 44 మంది మృతదేహాలపై రోజులపాటు పరీక్షలు నిర్వహించారు. పలు దేశాల్లో కొత్త వేరియంట్ ఒమిక్రాన్ విజృంభిస్తోంది. బ్రిటన్‌లో ప్రతిరోజు వేలల్లో కేసులు నమోదవుతుండగా.. అమెరికాలోనూ ఉద్ధృతి కొనసాగుతోంది. న్యూయార్క్ నగరంలో ఆసుపత్రుల్లో చేరుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతున్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. పిల్లల ఆసుపత్రుల్లో కొవిడ్‌తో సంబంధం ఉన్న కేసుల్లో నాలుగు రెట్ల పెరుగుదల కనిపించిందని న్యూయార్క్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ పేర్కొంది. భారత్‌లోనూ ఒమిక్రాన్ కేసులు పెరిగిపోతున్నాయి.

ఈ పరిస్థితి దేశంలో థర్డ్ వేవ్‌కు దారితీస్తుందనే భయం వ్యక్తమవుతోంది. మరో రెండు వారాల పాటు స్థిరంగా కేసుల పెరుగుదల కొనసాగితే.. మూడో వేవ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వైద్యశాఖలో సాధారణ బదిలీలకు సీఎం గ్రీన్‌సిగ్నల్

అమరావతి: ఒమిక్రాన్ కలకలంతో వైద్యశాఖ ఉన్నతాధికారులతో సీఎం జగన్ కీలక సమీక్ష ముగిసింది. వైద్య ఆరోగ్యశాఖలో సాధారణ బదిలీలకు సీఎం పచ్చజెండా ఊపారు. ఫిబ్రవరి నాటికి ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బంది ఉండాలన్నారు. అదే సమయానికి కొత్త నియామకాలు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. బూస్టర్‌డోసుకు ఏర్పాట్లు చేయండి కరోనా, ఒమిక్రాన్ ప్రభావాల దృష్ట్యా ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో వ్యాక్సినేషన్ ఉద్ధృతం చేయాలన్న సీఎం.. ఇంటింటికీ వెళ్లి టీకాలు వేయాలన్నారు. ఒమిక్రాన్ విషయంలో ఎలాంటి భయాందోళనలు అవసరంలేదన్నారు. ఒమిక్రాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. కేంద్రం బూస్టర్ డోసు ప్రకటన దృష్ట్యా అందుకుఅనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# కవి సమయం

## కర్తవ్య పాలన

కర్తవ్యోన్ముఖులను గావించునది
ఋణమార్గంలో నడిపిస్తూ
గమ్యానికి చేర్చునది
అరిషడ్వర్గాలను లోబరుచుకొని
కోరికల గుర్రాలకు పగ్గాలు వేసి
శాంతి, అహింస, కరుణ, ప్రేమ
దైవిక గుణాలను అలవర్చునది
భక్తి కరదీపిక భగవద్గీత
ఇష్టదేవతా సాక్షాత్కార మొనరించునది
భక్తి, జ్ఞాన,యోగ మార్గములలో
జీవితానికి దివ్యత్వం ఒసంగునది
స్వస్వరూప సాక్షాత్కారం ప్రసాదించునది
సకల మానవాళికి కర్తవ్య పాలన దిశగా
నడిపించు దివ్య, పవిత్ర గ్రంథం భగవద్గీత

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : నవమి మ.1.22; చిత్రం రా.12.22; వ.ఉ.8.56 ల 10.28; వ.తె.5.41.

మంగళవారం 28-12-2021

a **మేషం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. b **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. c **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. d **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కార మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమిత పడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. f **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహిం చటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమి కుల అత్యుత్సాహం అనర్థా లకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంత మంది మీ నుంచి ధనం లేక ఇతరత్రా సహా యం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు** : వృత్తి వ్యాపారు లకు అన్నివిధాలా అను కూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొం టారు. k **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విష యాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావల సిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. L **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన



రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీన జాతి వాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించి నయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్న వాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరిం పచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవం తుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్న వాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా - సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ-భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి.

మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమానమైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.

## పాత్రికేయుడికి నేను సైతం శివప్రసాద్ సాయం



కొయ్యూరు (విజయభాను న్యూస్) : అనారోగ్యంతో బాధపడుతున్న పాత్రికేయ మిత్రుడికి నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ అండగా నిలిచారు. కొయ్యూరు మండలం విజన్ న్యూస్ రిపోర్టర్ నగేష్ తీవ్ర అనారోగ్యంతో కొంత కాలం నుంచి బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ అతన్ని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కొంత కాలం నుంచి శ్వాస సమస్యతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీనికి చలించిన శివప్రసాద్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే ఫౌండేషన్ తరపున రూ.5వేల విలువ చేసే ఆక్సిజన్ కన్సంట్రేటర్ ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు.

## పార్మాసిటిలో ఉపాధి కల్పించాలాని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి వినతి



పరవాడ (విజయభాను న్యూస్) జవహర్ లాల్ నెహ్రు పార్మసిటీలో ఉద్యోగాలు కల్పించాలనీ కోరుతూ ముత్యాలమ్మపాలెం బహిరంగసభలో పాల్గోన్న ఎమ్మేల్యే అదీప్ రాజ్ కు,ఎమ్మేల్సీ వరుదుకళ్యాణికి సర్పంచ్ డాక్టర్ చింతకాఐయల సుజాతముత్యాలు వినతిపత్రం అందజేసారు. ముత్యాలమ్మ పాలెం పరిధిలో ప్రజలు అందరూ చేపలువేట మీదే జీవనం కొన సాగిస్తున్నారు అని పైపులైన్ కారణంగా వారు అంతా ఉపాది కోల్పోయారు అని అవేదన వ్యక్తం చేసారు. ఉపాది కోల్పోయిన 500మందికి ఉపాది కల్పించాలాని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో 2012మత్సకారుల దర్నాకు ప్రతిపలంగా గంగపుత్రులుకు 500మందికి ఉద్యోగాలు ఇస్తామనీ రాత పూర్వకంగా ఒప్పందం కుదుర్చుకున్న పార్మాయాజమాన్యం మోండి చేయి చూపించింది అని ఎమ్మేల్యే,ఎమ్మీల్సీలుకు వివరించారు. ఇప్పటికైనా గతంలో కుదుర్చుకున్న రాతపూర్వకఒప్పందం పై ఒత్తిడి తీసుకువచ్చి గంగపుత్రులుకు 500మందికీ ఉపాదికల్పించాలానీ కోరారు. సర్పంచ్ వినతిపత్రం పై స్పందించిన ఎమ్మెల్యే అధీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పార్మాయాజమాన్యంతో మాట్లాడి సమస్యను త్వరతగతంగా పరిష్కరిస్తామనీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అర్జిల్లిరవిదేవి, కొఅప్షన్ సభ్యులు మైలిపల్లి అప్పన్న తథితర్లు పాల్గోన్నారు.

## సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం

### 14 రోజులకు రూ.96.39 లక్షలు



అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు ను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సోమవారం నిర్వహించారు.గడచిన 14 రోజులకు గాను సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం రూ.96,39,516/-(తొంభై ఆరు లక్షల,ముపై తొమ్మిది వేల,ఐదు వందల పదహారు రూపాయలు) రాగా బంగారం 38 గ్రాములు, వెండి 923 గ్రాములతో పాటు విదేశీ కరెన్సీ యుయస్ఏ డాలర్లు 484,బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ 115 పౌండ్స్,యునైటెడ్ అరబ్ ఎమిరేంట్స్ సెంట్రల్ బ్యాంక్ 1255 దిన్హమ్స్ లభ్యమయ్యాయి. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు, ఏసి రమేష్ బాబు,ఏఈవో ప్రసాద్, పిఆర్వో కొండలరావు మరియు దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## పరిశీలనతో పరిమితమవుతున్న పాడేరు కేజీబీవీ విద్యాలయ సమస్య

### అధికారుల నిర్లక్ష్యం తో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం



పాడేరు (విజయభాను న్యూస్) : స్థానిక కస్తూరిబాయి గాంధీ విద్యాలయం లో గత నెలలో కలుషిత ఆహారం తిని సుమారు 80 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంగతి పాఠకులకు తెలిసిందే! ఈ నేపథ్యంలో ఈ సమస్య రాష్ట్ర స్థాయిలో పాకింది. ఈ సమస్యపై మంత్రులు ,శాఖాధిపతులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించినప్పటికీ ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలన కే పరిమితమయ్యారు. ఈ సంఘటన జరిగి ఈ నెల రోజులు దాటినప్పటికీ ఇప్పటి వరకూ ఆయా శాఖల అధికారులు పరిశీలన చేయడం తప్ప సమస్య పరిష్కారం చేసే దిశగా అడుగులు వేయడం లేదని ప్రజా సంఘాలూ ఆరోపిస్తున్నాయి. ఇదే సమస్య గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగి ఉంటే క్షణాలలో స్పందించి గిరిజన ఉపాధ్యాయులకు ఉన్నత అధికారులు బలి చేసేవారని అదేవిధంగా మైదాన ప్రాంతాల్లో ఇటువంటి సంఘటనలు జరిగితే అధికారులు హడావిడి చేసేవారని ఇప్పటివరకూ అధికారులు చర్యలు తీసుకోకుండా ఎంక్వైరీ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపణలు మిన్నంటుతున్నాయి.అధికారులు తీరుతో గిరిజన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆరోపిస్తున్నారు. సోమవారం ఆ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ మిడ్ డే మీల్ బివి రామరాజు ,స్థానిక మండల విద్యాశాఖ అధికారి సరస్వతి దేవి పాఠశాల లో తనిఖీ నిర్వహించి పరిశీలన చేశారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తో పాటు ఉపాధ్యాయులను ,వర్కర్లను సిబ్బందిని ఆ సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విడివిడిగా ఆ సంఘటనపై వివరాలు అడిగి రిపోర్టు తయారు చేస్తున్నారు. పాఠశాల ఆవరణంలో తాగునీరు ,వంటగది ,నిలువ ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. పూర్తి సమాచారం సేకరించి జిల్లా విద్యాశాఖ అధికారి కి రిపోర్టు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహనరంగా వర్ధంతి



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : స్వర్గీయ వంగవీటి మోహనరంగా చేసిన సేవలు మరువలేనివని ఖాజీపాలెం సర్పంచ్ పీలా నరసింగరావు , వైసిపి నాయకులు తోట వెంకటేష్ అన్నారు . ఆదివారం పల్లపు ఆనందపురం గ్రామంలో వారు వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల హృదయాలలో వంగవీటి మోహనరంగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే సమీక్షా సమావేశం



గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు

గొలుగొండ (విజయభాను న్యూస్) : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ ఈ నెల 28న గొలుగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో గ్రామాల అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## దుండవలస రైతులు డిమాండ్స్ లో న్యాయం ఉంది

### - శంకుపర్తి రోడ్డు కూడా చాలా అవసరం
### - గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు



అనంతగిరి (విజయభాను న్యూస్): మండలంలోని గుమ్మకోట పంచాయతీ పరిధి లోని శంకుపర్తి రోడ్డు కి సంభందించి సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్ భూమి కలుస్తుంది అని దానికి ప్రత్యామ్నాయంగా గవర్నమెంట్ భూమి అటవీ శాఖ వారు కి ఇస్తే అటవీశాఖ భూమిలో రోడ్డు వేసుకొనుటకు అనుమతించ డానికి అంగీకరించినందున వారి సూచన ప్రకారం భీమవరం రెవిన్యూ లో దుండవలస సమీపంలో లోని చీమల మెట్ట భూమి ఇస్తే బాగుంటుందని రెవిన్యూ వారు భావించారు,దీనికి సంబంధించి గ్రామస్థుల అభిప్రాయం కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. అయితే గ్రామస్థులు దీనికి అంగీకరించలేదు ఎందుకంటే చాలా మంది రైతులు సాగు చేస్తున్నారు. కనుక మాకు ఈ భూమి తప్ప వేరే దగ్గర భూములు లేవు కనుక అధికారులు పునరలోసించాలని చెప్పారు. అదివాస్తవం నేనూ అంగీకరిస్తున్నాను కానీ మన సహచర గ్రామాలు రోడ్డు మార్గం లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.అందుకని ఇక్కడ భూమి కొంత అలాగే మిగతా సర్వే నెంబర్ లో గాని మిగతా పంచాయితీ లో కానీ చూసి గ్రామస్థులు అందరికీ తగు న్యాయం చేయాలని ఇటు రైతులకు అటు శంకుపర్తి రోడ్డు కూడా జరిగేటట్లు అధికారులు సత్వరమే పనులు చేయాలని గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు ఒక ప్రకటనలో కోరారు.



సాగు చేసుకుంటున్న భూమిని అటవీశాఖ వారికి ఇవ్వవద్దని ఆందోళన చేస్తున్న గిరిజనులు

## నిరుపేద కుటుంబానికి సరుకులు పంపిణీ



గాజువాక (విజయభాను న్యూస్) : 61వ వార్డు పరిధి మార్కెట్ వీధిలో నివాసం ఉంటున్న రామారావు అనే వ్యక్తికి ఐదేళ్ళ క్రితం కాళ్ళుకు తీవ్ర గాయం కావటంతో ఆ కాళ్ళును తొలిగించటం జరిగింది. నాటి నుండి మంచం పైనే ఉంటున్నాడు. దీంతో భార్య లక్ష్మీ ఇద్దరు పిల్లలు సపరియాలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు కుడి కాళ్ళుకు ఇన్ ఫ్యాక్షన్ సోకటంతో ఆ కాళ్ళు తొలిగించాలని వైద్యులు చెపుతున్నారు. ఆసలే నిరుపేద కుటుంబమైన వారు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీరి ఆర్థిక ఇబ్బందులను గుర్తించి మల్కాపురం,పల్లివీధి ప్రాంతానికి చెందిన సాయి గణేష్ నూనెల తను ప్రతి నెల దాచుకున్న పాకెట్ మనిలో కొంత మొత్తంతో ఆ ఇంటికి అవసరమైన నిత్యవసర సరుకులు కొంత నగదును సాయం అందించాడు. పరోపకారానికి పెద్ద పీట వెయ్యాలని, నిస్సహాయులను ఆదుకోవాలని, అది మన భాద్యత అని సాయి గణేష్ నూనెల అన్నారు.

### డెంగ్యూ తో ఆసరా ఏఎన్ఎం మృతి?



బి.ప్రమీల (ఫైల్ ఫోటో)

అరకులోయ. మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎ ఎన్ ఎం గా. పనిచేస్తూ ఒక్క రోజే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బాధితురాలు పరిస్థితిని తెలుసుకున్నా కుటుంబీకులు విశాఖ కేజీహెచ్ తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబీకులు తెలిపారు వివరాల్లోకి వెళితేమృతురాలు బి.ప్రమీల (34)కు ఇద్దరు పిల్లలు కలరు.

**సీపీఎం పార్టీ 26వ రాష్ట్ర మహాసభ విజయవాడలో జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పి.మధుతో అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరావు**



## విద్యాభ్యాసానికి రూ.15,000 లు ఆర్థిక సహాయం అందజేయత



భీమునిపట్నం (విజయభాను న్యూస్): పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి రామమూర్తి , రాపర్తి సుబ్బారావు అధ్వర్యంలో మధురవాడ స్వతంత్ర నగర్ కు చెందిన కప్పల దివ్యభారతి కిజిఎన్ ఎం ( నర్స్ ) విద్యాభ్యాసానికి సెకండ్ ఇయర్ ఫీజు నిమిత్తం పివా ఉత్తరాంధ్రా ద్వారా రూ.15,000 ఆర్థిక సహాయం పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ మెంబర్& జివియంసి కో ఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విభాగం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ బాగా చదువుకొని తల్లితండ్రులు కు మంచి పేరు తీసుకుని రావాలనీ తెలిపారు. కొప్పల ప్రభావతి మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడవాళ్లు కూడా చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుతున్నానీ, నీవు కూడా బాధ్యతగా చదువుకోవాలనీ ఆమెతో చెప్పారు. ఈ కార్య క్రమంలో పీవా సెంట్రల్ కమిటీ మెంబెర్స్ చిక్కా సత్య నారాయణ, ఉపాధ్యక్షులు కొప్పల రామ్ కుమార్, అయ్యంకల రాజారత్నం, పంపాన కామేశ్వరి, సింహాచలం దేవస్థానం ధర్మకర్త సూరిశెట్టి సూరిబాబు, వానపల్లి ఈశ్వరరావు, కొప్పల.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంకల్పయాత్రకు విశేష స్పందన

## నాయుడుపాలెంలో అడుగుఅడుగునా ప్రజా నీరాజనం





పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలంలో స్థానిక పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ రెండోవ రోజు నాయుడు పాలెం గ్రామం నుండి ప్రారంభించారు.ఎమ్మెల్యే కి నాయుడు పాలెం గ్రామ సర్పంచ్ కుంద్రపు వరలక్ష్మి సీతారామయ్య ఘన స్వాగతం పలికారు.. అనంతరం నాయుడు పాలెం పంచాయతీ లో ఈ సందర్భంగా పెందుర్తి శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ 56.74 లక్ష రూపాయల తో పలు అభివృద్ధి పనులు కు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. గ్రామ సచివాలయం 25 లక్షలు తోప్రారంభం చేసారు.డిజిటల్ లైబ్రరీ భవనం 16 లక్షలుతోశంకుస్థాపనచేసారు.బల్క్ మిల్క్ సెంటర్ భవనం శంకుస్థాపన 15.74 లక్షలుతో శంకుస్థాపన చేసారు.నాడు నేడు నిధులతో పాఠశాల మరమ్మతులు చేపట్టిన భవనం ప్రారంభోత్సవం 15.5 లక్షలు తో ప్రారంభోత్సవాలు చేయడం జరిగింది. తదనంతరం ఎమ్మెల్యే నాయుడు పాలెం, గ్రామాల్లో పాదయాత్ర చేశారు.

ఈ కార్యక్రమంలో లో నియోజకవర్గ ఇంఛార్జి అన్నం రెడ్డి అజయ్ రాజ్ , జెడ్పీటీసీ పీఎస్ రాజు,ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి ,రాష్ట్ర సి.ఈ. సి సభ్యులు పైల శ్రీనివాసరావు , వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర రావు,మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల ముత్యాలు సుజాత,గొర్లివాన్నిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, పేదమూషిడివాడ సర్పంచ్ పల్ల అప్పారావు నాగమణి, నాయుడు పాలెం ఎం.పి.టి.సి అభ్యర్థి,కోఆప్టెడ్ సభ్యులు మైలపల్లి అప్పన్న, బండారు కృష్ణబాబు, పెందుర్తి వైస్ ఎంపిపి చిరికి దేముడు, ఎంపిడిఓ హేమ సుందర్, పరవాడ తహశీల్దార్ బి.వి రాణి గారు, వై.సి.పి నాయకులు యమహా నాయుడు, దాదా నాయుడు, కన్నూరు నేస్తాలు, చింతకాయల అమ్మోరు, వై.సి.పి ముఖ్య నాయకులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన (ప్రైవేటు) రక్త పరీక్ష కేంద్రం ప్రారంభం



అరకులోయ (విజయభాను న్యూస్) : గిరిజన ప్రాంతంలో సీజనల్ అనారోగ్యాలతో బాధ పడుతున్న గిరిజన ప్రజలు వారి రోగ నిర్ధారణ పరీక్షలు కొరకు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, అత్యవసర పరిస్థితిని సమయాల్లో వినియోగ పడే విధంగా విక్టర్ మెడికల్ ల్యాబరేటరీ ని, పట్టాదారులైన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ లివినోద్‌లి నూతనంగా నిర్వహించనుండగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బిపలువురు వైసిపి శ్రేణులతో కలిసి రిబ్బన్ కట్ చేసి రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ.. గిరిజన యువత ల్యాబ్ టెక్నీషియన్లు గా మారి, గిరిజన ప్రజా ఆరోగ్య పరిరక్షణ కొరకు, స్వచ్ఛందంగా మెడికల్ ల్యాబ్ లను నిర్వహించడమనేది గొప్ప విషయమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఓ వైపు మండలంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ... అక్కడ రద్దీగా ఉన్న వేళల్లో మరియు అత్యవసర పరిస్థితులు నెలకొన్న సమయాల్లో, ఎమర్జెన్సీ రక్త పరీక్షల నిర్వహణకు ఇలాంటి ల్యాబ్ లు ఉపయోగ పడనున్నాయని ల్యాబ్ టెక్నీషియన్ వినోద్ కు ఎమ్మెల్యే అభినందనలు తెకియజేశారు.

# ఘనంగా క్రిస్మస్ పండుగ వేడుక

## మెథడిస్ట్ చర్చ్, డా.పి. కె.జోషి (కన్సర్న్) సంస్థ ఆధ్వర్యంలో రగ్గులు, స్వెట్టర్స్, చీరలు పంపిణీ



అనంతగిరి (విజయభాను న్యూస్) : కొరపర్తి గ్రామం లో స్థానిక పాస్టర్ అనిల్ మాత్యు ఈ ప్రాంత పాస్టర్స్ ఆధ్వర్యంలో పినకోట, పెదకోట, కివర్ల, పంచాయతీ ల పరిధిలో గల గిరిజనులు క్రిస్మస్ వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో సుమారు ఐదువందలు పైబడి పెదకుటుంబాలవారు క్రిస్మస్ ఆరాధనలో పాల్గొని దేవుని మహిమ పరచారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఫస్ట్ లవ్ గస్పల్ చర్చ్. పినకోట పాస్టర్ దావీదు కుర్ప, గౌరవ అధ్యక్షులు బిషప్ రైట్. రెవ. మనోజ్ రవికాంత్ (హార్ట్ చర్చ్ మినిస్ట్రీస్ వైజాగ్),ముఖ్య వాక్యోప దేశకులుగా రెవ.. ప్రేమ్ కుమార్ మహంతి, (యు.ఇ. చర్చ్. కె.కోటపాడు) పాల్గొని క్రిస్మస్ పండగ సందేశాన్ని వినిపించడం జరిగింది . మేథడిస్ట్ చర్చ్ & "కన్సర్న్ "సంస్థ. వైజాగ్, వ్యవస్థాపకులు డాక్టర్.. పి.కె.జోషి (మేనేజింగ్ ట్రస్టి)సహాయం తో అనంతగిరి ఎంపీపీ యస్.నీల వేణి, పెదకోట ఎంపీటీసీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ చేతులు మీదుగా రెండోదలయాభై మంది పేద కుటుంబాలకు రగ్గులు, యాభై మంది పిల్లలకు స్వెట్టర్స్, నలభై మంది మహిళలకు చీరలు పంచిపెట్టడం జరిగింది. అనంతరం వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు. గౌరవ ఆహ్వానితులు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి ,పెదకోట ఎంపీటీసీ శిరగంశ్రావణి ,మార్కెట్ యార్డ్ చైర్మన్ రామలక్ష్మి,లోకల్ పాస్టర్స్,రివైవల్ ఫ్రైజ్ & వర్షిప్ బృందం సేవకులు,సంఘం పెద్దలు మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



# ఘనంగా కామత్ హొటల్ 3వ బ్రాంచ్ ప్రారంభం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దశాబ్దాలుగా కామత్ అద్భుతమైన రుచులు విశాఖ ప్రజల మదిని దోచుకుంటున్నాయని విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి. గోపినాథ్ రెడ్డి అన్నారు.విశాఖపట్నం ద్వారకానగర్ మొదటి లైన్ లో కామత్ హొటల్ 3వ బ్రాంచ్ ను అత్యంత ఆడంబరంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గోపినాధ్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నూతన హొటల్ బ్రాంచ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా గోపినాధ్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన వంటకాలు రుచికరంగా వినియోగదారులకు అందిస్తే వారి ఆదరణ కలకలం నిలిచి ఉంటుందనడానికి కామత్ ఉదాహరణగా పేర్కొన్నారు.కామత్ హొటల్ అధినేత ఎస్.సుబ్బరాజు మాట్లాడుతూ కాశీ అన్న పూర్ణమ్మ చల్లని ఆశీస్సులతో సంపత్ వినాయ కుని అనుగ్రహంతో తాము దినదినాభివృద్ధి చెందామన్నారు.నాణ్యమైన రుచులతో వైజాగ్ లో కామత్ కు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందన్నారు.విశాఖలో కాశీ అన్నపూర్ణ దేవాలయం నిర్మాణపనులను 20 22లో ప్రారంభిస్తామన్నారు.దేవుని అనుగ్రహం తో ప్రతి ఏటా లక్ష మందికి అన్నదానం నిర్వహిస్తున్నామని చెప్పారు. నిత్యం పేదవారికి తనవంతు ఆర్థిక సాయం చేస్తూనే ఉన్నా నన్నారు. తనను వైజాగ్ ప్రజలు ఎంతగానో ఆదరించినందుకు వారికి కృత్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోపినాధ్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, కామత్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు సుబ్బరాజుకు అభినందనలు తెలిపారు.

# అక్కరమాని వెంకటరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన

## భీమిలి జోన్ వైసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి

భీమునిపట్నం(విజయభాను న్యూస్) : వై.సి.పీ భీమిలి పట్టణ అధ్యక్షుడు అక్కరమాని.వెంకటరావు 54వ పుట్టినరోజు సందర్భంగా భీమిలి జోన్ పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి కలిసి శాలువా కప్పి,పుష్పగుచం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో సీనియర్ నాయకులు చిల్ల వెంకట రమణ,కుమిలి సూర్యనారాయణ, జీరు భరత్ రెడ్డి. ఎం.ఉమాశంఖర్. తదితర నాయకులు పాల్గొన్నారు.



# వయస్సులో చిన్నోడు..ప్రజాసేవలో పెద్దోడు

- జడ్పీటీసీ పియస్ రాజు తన రాజకీయ గురువు
- సర్పంచ్ పల్లా సౌరధ్యంలో వైస్ సర్పంచ్
- అలమండ గ్రామాభివృద్ధి
- విజయభాను ప్రతినిధితో వైస్ సర్పంచ్ అలమండ నారాయణరావు

పరవాడ (విజయభాను న్యూస్) :వయస్సులో చిన్నోడు ప్రజాసేవలో మనస్సున్న మారాజుగా పెదముషిడివాడ వైస్ సర్పంచ్ అలమండ నారాయణ రావును అనడములో ఏటువంటి సందేహము లేదు...పరవాడ మండలము పెదముషిడివాడ పంచాయితీ పరిధిలో గల పచ్చిగోరువానిపాలెం వారి స్వస్థలం..పుట్టికతోనే పేదరికంలో పుట్టిన అయన "ఐలవ్ పుర్ పీపుల్స్ " అనే నినాదంతో పేదవాడుకు ఏకష్టమోచ్చినా నీను ఉన్నాను అంటూ భరోసా కల్పించే గొప్ప సేవాతత్పురుడుగా వైస్ సర్పంచ్ అలమండ నారాయణరావును చెప్పు కుంటున్నారు అని పంచాయితీ ప్రజలు పలువురు పేర్కొంటున్నారు. పేదరికంలో పుట్టిన అయన అంచెలుఅంచెలుగా ఎదు గుతూ గ్రామంలో అనేకసేవా కార్య క్రమాలు చేపట్టారు. దీంట్లో ముఖ్యంగా అలయాలు అభివృద్ధి, పాఠశాలలో మౌళికసదుపాయాలు కల్పనా,పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు అని పలువురు అంటున్నారు. గ్రామంలో యువత అలమండ నారాయణరావు సేవా కార్యక్రమాలు చూసి అయన్ని అదర్శింగా తీసుకుని అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. సోమవారం విజయభాను ప్రతినిధితో పెదముషిడివాడ వైస్ సర్పంచ్ అలమండ నారాయణరావు మాట్లడుతూ తను 16వ సంవత్సరమే రాజకీయంలోకి రంగప్రవేశం చేసాను అన్నారు. తన రాజకీయ గురువుగా పరవాడ జిల్లా ప్రాదేశిక సభ్యులు పి.యస్ .రాజు అని గర్వంగా పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి వర్యులు డా"వైయస్ రాజశేఖర్ రెడ్డి మరియు ప్రస్తుత అంద్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి అంటే తనకు ఏంతో ఇష్టమనీ అన్నారు. ఇటీవలే జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పెదముషిడివాడ పంచాయితీలో 11వ వార్డు మెంబర్ గా గెలిపొంది వైస్ సర్పంచ్ పీఠం దక్కించుకున్నారు అన్నారు. అప్పటినుండి పెదముషిడివాడ సర్పంచ్ పల్లానాగమణి సౌరద్యంలో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సహకారముతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామనీ అన్నారు. గండివానిపాలెం నుండి నక్కవానిపాలెం వరకు వీదీలైట్లు ఏర్పాటుచేసామనీ అన్నారు. హైమాక్స్ దీపాలు ఏర్పాటు చేసామని తెలిపారు. పచ్చిగోరువాని పాలెంలో రెండు డ్రైనేజులు మంజూరు అయ్యాయి అన్నారు. 16లక్షలు వెచ్చించి సిసీరహదారులు రెండుంటిని పూర్తి చేసామనీ అన్నారు. వాటర్ ట్యాంక్ కు శంకుస్థాపన చేసామనీ అన్నారు. వైసిపితోనే గ్రామాలు అభివృద్ధి చేందుతాయనీ ఈసందర్భంగా అయన తెలిపారు. ఇటు వంటి పలు అభివృద్ధికార్యక్రమాలుకు సహకరీంచిన పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డీ అదీప్ రాజ్ కు, పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ కు, పరవాడ జడ్పిటిసి పియస్ రాజ్ కు, పెదముషిడివాడ వైస్ సర్పంచ్ అలమండ నారాయణరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు. ఇంకా రానున్నరోజుల్లో పెదముషిడీవాడ పంచాయితీ మరింత అభివృద్ధికి కృషిచేయాలానీ స్థానిక శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ను కోరారు.



# సబ్సిడీపై పశువుల దాణ, చాప్ కట్టర్లు

వి మాడుగుల (విజయ్ భాను న్యూస్) : మండల కేంద్రమైన మాడుగుల లో సబ్సిడీపై సంపూర్ణ మిత్రమా పశువుల దాణ, చాప్ కట్టర్ లను అందిస్తున్నట్లు మాడు గుల పశు వైద్య సహాయ సంచాలకులు వి చిట్టి నాయుడు తెలిపారు. పశువుల దాణాను 60 శాతం సబ్సిడీ పైన, చాప్ కట్టర్ లు ను 40 శాతం సబ్సిడీపై అందిస్తు న్నామని వీటితోపాటు పశుగ్రాస విత్తనాలు, లివర్ టానిక్, వాతపు పొడి, మినరల్ పిక్చర్లు సరఫరా చేస్తున్నామన్నారు. కావలసినవారు సమీపంలోని పశువైద్యశాల ని గానీ రైతు భరోసా కేంద్రం గాని సంప్రదించాలని కోరారు.



# టెక్నో కేమన్ 18 స్మార్ట్ ఫోన్ విడుదల

విశాఖపట్నం: అంతర్జాతీయ ప్రీమియం స్మార్ట్ ఫోన్ బ్రాండు అయిన టెక్నో మరోసారి బ్లాక్‌బస్టర్ స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించింది. ఈ సెగ్మెంటులో ఇదే మొదటిసారి. కేమన్ సిరీస్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన కెమెరా ఫోన్ కేమన్ 18ను తాజాగా విడుదల చేసింది. ఈ స్మార్ట్ ఫోన్‌తో అద్భుతమైన పిక్సెల్స్ కలిగిన కెమెరా, టైవోస్ టీఎం టెక్నాలజీతో సూపర్ నైట్, ఐ ఆటోఫోకస్, ప్రొఫెషనల్ వీడియో షూటింగ్ అనుభవాలు మీ సొంతమవుతాయి. కేమన్ 18 6.8 ఎఫ్‌హెచ్‌డీం డాట్ ఇన్ డిస్‌ప్లే కలిగి ఉండి, 'డేజ్లింగ్-ఫాస్ట్' మీడియాటెక్ హీలియో జి85 ప్రాసెసర్, 7 జీబీ రామ్ వర్చువల్ మెమొరీ ఎక్స్‌టెన్షన్ వల్ల అన్ని అవసరాలకూ ఇది సరైన పరికరం అవుతుంది. కొత్త ఫోన్ ఆవిష్కరణ సందర్భంగా ట్రాన్సిషన్ ఇండియా సీఈవో అరిజీత్ తలపత్రా మాట్లాడుతూ, "మా వినియోగదారులకు స్ఫూర్తి కలిగించే మంచి పరికరాలను తీసుకురావాలన్నదే మా నిరంతర ధ్యేయం. ఈ బ్రాండు ఇప్పుడు పదివేలు, అంతకంటే ఎక్కువ సెగ్మెంట్లలోనూ మా ఆధిక్యాన్ని నిలబెడతాయి" అని అన్నారు.

# మందుబాబులుకు జరిమానా...

## ఎస్ఐ రామకృష్ణ

పరవాడ (విజయభాను న్యూస్ : గడిచిన తేదీలలో పరవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వక్తులను,సోమవారం హానరబుల్ కోర్టు స్పెషల్ రెండవ తరగతి మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరు పరుచుగా, మొత్తం 8 మంది వక్తులు లో అనకాపల్లి కోర్టు వారు ఇద్దరు కు 4000, ఇద్దరుకు 3000, నలుగురు కు 2000చొప్పున మొత్తం 22000/- జరిమానా విందించడమైనది అని పరవాడ ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ తెలియపరిచారు.



# అన్ని దానాల కన్నా రక్త దానం మిన్న



గాజువాక (విజయభాను న్యూస్ : అన్ని దానాల కన్నా రక్త దానం మహాదానం అని గాజువాక పోలీస్ స్టేషన్ సిఐ మల్లేశ్వర రావు అన్నారు. జివిఎంసి 58 వ వార్డు పిలకవాని పాలెంలోని అమర్ పాఠశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి మల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువత 36 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు యువతని అభినందించారు.

# సీఆర్పీఎఫ్ ప్రతినిధికి ఫిజికల్ ఫిట్నెస్ బోర్డ్ సభ్యునిగా నియామకం హర్షణీయం

## - రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం




విశాఖపట్నం (విజయభానున్యూస్) : దేశ వ్యాప్తంగా ఎన్నో ఏళ్ళుగా బాలల హక్కులు వారి సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్న చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) విశాఖ నగర శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.హరీష్ కుమార్ కు నేషనల్ స్పోర్ట్స్ & ఫిజికల్ ఫిట్ నెస్ బోర్డ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సభ్యునిగా కేంద్ర పాలకమండలి నియమించడం హర్షణీయమని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం విశాఖ నగరంలోని ప్రభుత్వ అతిధి గృహంలో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం హరీష్ కు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు, అనంతరం తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం నేతృత్వంలో బాలల హక్కులు పరిరక్షణ వారి సంక్షేమానికి ఎనలేని సేవలు అందిస్తున్నందుకు గాను గుర్తించి కేంద్ర పాలక వర్గం హరీష్ కు ఈ పదవి కట్టబెట్టడం గర్వించ దగ్గ విషయమన్నారు,మరిన్ని ఖ్యాతినార్జించే పదవులు చేపట్టాలని సూచించారు. సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ హరీష్ కుమార్ తమ ఫోరం విశాఖ నగర కార్యదర్శి గాను స్కౌట్స్ మరియు గైడ్స్ సంస్థ ద్వారా ఎన్నో ఏళ్లుగా పిల్లలతో మమేకమై అందిస్తున్న సేవలకు గాను ఈ పదవీ వరించడం ఫోరం నిబద్ధతతో కల్గిన పని తీరుకు గుర్తింపుగా భావిస్తున్నామని అన్నారు,రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వివిధ ఆటల్లోను శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర బోర్డ్ ప్రతినిధులు ఈ నియామకం చేపట్టడం అభినందనీయమని అన్నారు.

# ప్రధానమంత్రికి కొత్తపాలెం విద్యార్థుల పోస్టు కార్డులు

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : అజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రికి మాకవరపాలెం మండలం కొత్తపాలెం పాఠశాల విద్యార్థులు పోస్టుకార్డులు రాశారు. స్వాతంత్రం వచ్చి 2047వ సంవత్సరం నాటికి వంద సంవత్సరాలు పూర్తవు తాయి. ఈ సందర్భంగా 2047వ సంవత్సరం నాటికి మన భారతదేశం ఏ విధంగా ఉండాలి, ఏఏ రంగాలలో ముందుండాలనే అంశాలపై తమ అభిప్రాయాలను రాశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోసూరు రాము వివరించారు.




# అభివృద్ధి చేస్తుంటే ఆరోపణలా..?

## పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మీ



కొయ్యూరు (విజయభాను న్యూస్): పాడేరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేయడం తగదని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలో నూతన మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 20, 30 సంవత్సరాల నుండి పాత బిల్డింగ్‌లో మండల పరిషత్ కార్యాలయ పనులు జరిగేవని, గత కొంత కాలంగా ఈ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ వారా నూక రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రతి పనిని సచివాలయంలో పరిష్కారం జరిగే విధంగా చూస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా కూడా రైతులకు వారివారి ఖాతాలకు రైతు భరోసా సొమ్మును జమ చేస్తున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మారుమూల ప్రాంతాలు రోడ్లు లేక నానా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు వాటిని గుర్తించి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం డౌనూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జల్లి హలియారాణి, వైస్ ఎంపీపీ అప్పన్న వెంకటరమణ, వైసిపి నాయకులు జల్లి బాబులు, డౌనూరు ఎంపిటిసి బిడిజాన అప్పారావుతో పాటు పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# బిడిఎస్ ఫైనల్ పరీక్ష ల్లో మెరిసిన

# అనిల్ నీరుకొండ విద్యార్థులు







భీమునిపట్నం (విజయభాను న్యూస్): డాక్టర్ ఎన్ టి ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన బి డి ఎస్ ఫైనల్ పరీక్ష ల్లో సంగి వలస అనిల్ నీరుకొండ దంత వైద్య విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల కు చెందిన కృష్ణ ప్రకాష్ యూనివర్సిటీ స్థాయి లో ప్రధమ స్థానం తొమ్మిదవ స్థానం శ్రేయసి చట్టోపదోయా, పదవ ర్యాంక్ వి కీర్తి లు కైవసం చేసుకున్నారు.

అలానే రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానా ల్లో పు ముగ్గురు విద్యార్థులున్నారు ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి సోమవారం కళాశాల లో అభినందించారు.

# మోసయ్యపేటలో చోరీ



అచ్యుతాపురం, విజయబాను: మోసయ్యపేట గ్రామంలో అద్దెకు ఉంటున్న పల్ల వ్యాపారి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. వివరాల్లోకి వెళ్తే నునపర్తి రమాదేవి అచ్యుతాపురం కూడలిలో పల్ల వ్యాపారి. ఈమె తన పిల్లలతో భవానీ మాల ఇరుముడ్లు కట్టుకొని తీసేందుకు ఆదివారం ఉదయం విజయవాడ వెళ్ళి తిరిగి వచ్చే సరికి బీరువా తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గమినించిన రమాదేవి బీరువాలో ఉన్న పావు తక్కువ 2 తులాల బంగారం, 4 తులాల వెండి, 30వేల నగదు కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ ఉపేంద్ర కేసు నమోదు చేసి, సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భవిష్యత్ తరాలకు చారిత్రక జ్ఞానాన్ని అందించాలి

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




గ్రంధాలయంలో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ (విజయభాను న్యూస్): చారిత్రక జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో అవసరమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఏయూ డాక్టర్ వి.ఎస్ క్రిష్ణ గ్రంధాలయంలో ఉన్న తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న భాషల్లో రచించిన తాళపత్రాలను ఏయూలో దశాబ్దాలుగా బధ్రపరచడం జరుగుతోందన్నారు. వీటిని డిజిటలైజేషన్ చేసి భవిష్యత్ తరాలకు ఉపయుక్తంగా వీటిని శాస్వతంగా ఉంచే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఈ విలువైన సంపదను భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతోందన్నారు. దేశ వ్యాప్తంగా నిపుణులను గుర్తించి, ఎంపిక చేసి వారికి ఈ పనిని అప్పగించామన్నారు. భవిష్యత్తులో వీటిని ఏయూ వెబ్‌సైట్‌లో, ఇంటర్నెట్ సహాయంతో ప్రజలకు సైతం అందుబాటులో ఉంచే ఆలోచన ఉందన్నారు. గ్రంధాలయాధికారి ఆచార్య పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూసా నిధులలో చారిత్రాత్మకంగా నిలచే ప్రాజెక్టును నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీలో 5 భాషల్లో ఉన్న 2663 తాళపత్రాలను ఏడాది కాలంలో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేస్తామన్నారు. వర్సిటీ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తాళపత్రాలు డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్‌డి ఆచార్య వి.క్రిష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఇన్ఫర్మేటిక్స్ పబ్లిషింగ్ లిమిటెడ్ ప్రతినిధులు బి.ఎస్ రవిశంకర్, ఎం.జగన్నాథ్, గ్రంధాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత అరవై సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో జీవన సాగిస్తున్న వారి జీవితాల్లో

# వెలుగులు నింపేందుకు యధాశక్తి కృషి చేస్తున్నాము

## జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు



విశాఖపట్నం (విజయభానున్యూస్) : గత అరవై సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో జీవన సాగిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు యధాశక్తి కృషి చేస్తున్నామని జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. సోమవారం జీవీఎంసీ అధికారులు, గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి వార్డు పరిధిలో ఏడుగుళ్ళు ప్రాంతంలో ఉన్న మురికివాడలను అయన సందర్శించారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మురికివాడల్లోని పూరిగుడిసెల స్థానంలో పక్కా ఇళ్ళు రెండు గదులతో నిర్మించేలా ప్రణాళికలు తయారుచెయ్యాలని అధికారులను కోరారు.దశాబ్దాలుగా మురికివాడలోని ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పక్కా ఇళ్ళు నిర్మించాలని కోరారు.ఇప్పటికే జీవీఎంసీ మేయర్,కమిషనర్, మున్సిపల్ శాఖ మంత్రి లకు మురికివాడలో పక్కా ఇళ్లకోసం విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే కౌన్సిల్ కూడా పక్కా ఇళ్లకోసం ప్రస్తావిస్తానని తెలిపారు.వార్డు ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని నాగరాజు వ్యాఖ్యానించారు.ఈ పర్యటనలో ఏఈ వినాయకరావు,డీఈ సత్యనారాయణ,వర్కింగ్ ఇనస్పెక్టర్ నాయుడు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ సర్కార్‌కు హైకోర్టులో చుక్కెదురు

అమరావతి : రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల ఖరారుపై ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో 53, 54జీవోలను చేసిన విషయం తెలిసిందే. ఈ జీవోలను సవాల్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సోమవారం విచారించిన ఉన్నత న్యాయస్థానం.. మేనేజ్‌మెంట్ నుంచి ప్రతిపాదనలు తీసుకొని కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో రుసుములను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఆగస్టు 24న 53, 54 జీవోలు ఇచ్చింది.

అయితే, వీటిని సవాలు చేస్తూ 'తూర్పు గోదావరి ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్' అధ్యక్షుడు దాసరి దుర్గా శ్రీనివాసరావు, మరికొన్ని విద్యాసంస్థల తరపున గతంలో వ్యాజ్యాలు వేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల్లో రుసుములను ఖరారు చేస్తూ ఏకపక్షంగా జీవోలు జారీ చేసిందంటూ హైకోర్టుకు విన్నవించాయి. రుసుములను ఖరారు చేసే ముందు విద్యాసంస్థల్లోని మౌలిక సదుపాయాల కల్పన, వ్యయాలను దృష్టిలో పెట్టుకోలేదని గుర్తుచేశాయి.

# రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదే

## పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ రావు

విశాఖపట్నం (విజయభానున్యూస్) :రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ రావు అన్నారు. జీవీఎంసీ 45 వ వార్డు జనసేన నాయకుడు తుమ్మల త్రినాధరావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి 127మంది నాయకులు జనసేనలో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శివశంకర్ మాట్లాడుతూ

జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకువెళ్లేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనసేన పార్టీ ప్రశ్నించే స్థాయి నుంచి పాలించే స్థాయికి చేరుకుంటుందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికి స్వాగతం పలికారు. జనసేన సీనియర్ నాయకుడు సంకు వెంకటేశ్వర రావు సారథ్యంలో జరిగిన ఈ భారీ చేరిక కార్యక్రమంలో సంకు మాట్లాడుతూ ఇది ప్రారంభం మాత్రమేనని త్వరలో మరింతమంది పార్టీలో చేరుతారన్నారు.రాష్ట్ర నాయకులు శివశంకర్,బొలిశెట్టి సత్య తదితర నాయకులు పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, డాక్టర్ బోడేపల్లి రఘు,వన్నెంరెడ్డి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు పవన్ కళ్యాణ్ కు జేజేలు పలుకుతూ జనసేన వర్ధిల్లాలి అంటూ నినాదాలతో కార్యక్రమప్రాంగణాన్ని హోరెత్తించారు.

# గిరిజన ధార్మిక సేవ చేపట్టిన విశాఖ శారదాపీఠం

- చలి తీవ్రత అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో రగ్గుల పంపిణీకి శ్రీకారం
- దేవాలయ దర్శనం ఎంత ముఖ్యమో, సమాజసేవ అంతే ముఖ్యం
- గిరిజనులకు ఇరవై ఏళ్లుగా శారదాపీఠం ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది
- విశాఖ శ్రీ శారదా పీఠం ఎవరి మోచేతి నీళ్లకు ఆశ పడదు
- శారదా పీఠం చేరుతున్న సేవా కార్యక్రమాలు తెలియని వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు.
- విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు



విశాఖపట్నం /పెందుర్తి (విజయభాను న్యూస్) : విశాఖ శ్రీ శారదాపీఠం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చలి తీవ్రత అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో రగ్గుల పంపిణీ చేపట్టింది. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంతాలతో పాటు విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి ఏజెన్సీ గ్రామాల్లో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి గిరిజన ధార్మిక సేవ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమానికి రగ్గులు తదితర సామాగ్రితో బయలుదేరిన వాహనాలకు పీఠాధిపతులు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారు మాట్లాడుతూ దేవాలయ దర్శనం ఎంత ముఖ్యమో, సమాజసేవ కూడా అంతే ముఖ్యమన్నారు. మైదాన ప్రాంతాలే చలికి గజగజలాడుతుండగా, గిరిజన ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లలు పడే ఇబ్బందులను తలచుకుని మనసు కలిచి వేసిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇరవై ఏళ్లుగా విశాఖ శ్రీ శారదాపీఠం ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. గతంలో గిరిజనులకు గోవులను అందజేశామని, కరోనా సమయంలో మందులు పంపిణీ చేశామని తెలిపారు. రాజ శ్యామల అమ్మవారి అనుగ్రహంతో విశాఖ శ్రీ శారదాపీఠం చేపట్టిన గిరిజన ధార్మిక సేవా స్ఫూర్తితో మరింత మంది దాతలు గిరిజన గ్రామాల్లో రగ్గులు పంపిణీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖ శారదా పీఠం

విశాఖ శ్రీ శారదా పీఠం ఎవరి మోచేతి నీళ్లకు ఆశ పడదని, రాజశ్యామల అమ్మవారి భక్తులు పీఠానికి చేస్తున్న సహాయ సహకారాలతోనే ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ధార్మిక సేవ తో పాటు సామాజిక సేవ చేస్తున్నా విశాఖ శ్రీ శారదా పీఠం పై తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. పీఠానికి అత్యంత భక్తులైన దివిస్ ల్యాబరేటరీస్, ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆర్థిక సహకారంతో గిరిజన ధార్మిక సేవకు విశాఖ శ్రీ శారదాపీఠం శ్రీకారం చుట్టిందని తెలిపారు.



# జగన్ సారధ్యంలో సర్వతోముఖాభివృద్ధి దిశగా రాష్ట్రం

- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ చేసిన అప్పులు తక్కువే
- ట్విట్టర్ వేదికగా ఎంపీ విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రధాన రంగాలన్నింటిలోనూ ఏపీ గతంలో కంటే పురోగతి సాదించిందని కోవిడ్ సంక్షోభం కారణంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వాటన్నింటినీ అదిగమించి రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కోన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్-2021 నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించిందని అన్నారు. మానవ వనరులు అభవృద్ధిలో మెరుగు, నైపుణ్యాల కల్పన, ఉద్యోగ ఉపాది కల్పనలో ముందంజు, భద్రత పరంగా దోషులకు సత్వర శిక్షలు, ప్రజారోగ్యం దిశగా మెరుగైన మౌళిక వసతులు, ఆర్థిక స్వావలంబనలో పురోగమించిన మహిళా సంక్షేమం, అబివృద్ధిలో ప్రగతి మెదలగు అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదిక వెల్లడించినట్లు తెలిపారు. కోవిడ్ సంక్షోభం నేపద్యంలో కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేంద్ర ప్రభుత్వం అదనపు అప్పుకు అనుమతించినప్పటికీ 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్

రాష్ట్రం మిగతా రాష్ట్రాలకన్నా పరిమితికి లోబడే అప్పులు చేసిందని అన్నారు. కాగ్ ప్రాధమిక అకౌంట్ల పరిశీలనలో ఈ విషయం వెల్లడయ్యిందని అన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బడ్జెట్ అంచాలకు మిచి 14.23% అప్పు చేయగా, తెలంగాణ 37.50%, కర్నాటక 40.12%, బీహార్ 47%, తమిళనాడు 55.54% అప్పు చేసిందని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని అన్నారు.



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో నిర్వహించిన మంత్రి ఆదిమూలపు సురేష్ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు శ్రిష్టి, సిద్ధార్థ్‌లను ఆయన ఆశీర్వదించారు.

# 'స్పందన'కార్యక్రమం నిర్వహించిన కమిషనర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో నిర్వహించిన "స్పందన" కార్యక్రమంనకు 64 ఫిర్యాదులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశమందిరం నందు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 01గంట వరకు "స్పందన" కార్యక్రమం నిర్వహిం చారు. "స్పందన" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా స్వీకరించిన ఫిర్యాదులు రెండవ జోనుకు 03, మూడవ జోనుకు 12, నాలుగవ జోనుకు 07, అయిదవ జోనుకు 16, ఆరవ జోనుకు 13, ఎనిమిదవ జోనుకు 02, మెయిన్ ఆఫీసునకు 11, మొత్తము 64 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన కమీషనర్ ఉన్నతాధికారులతోను, జోనల్ కమిషనర్లతోను మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, అదనపు కమిషనర్(ఇంచార్జ్)/జె.డి.(అమ్రిత్) విజయ భారతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, డి.సి.ఆర్. నల్లనయ్య, ఎ.డి.(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, డిప్యుటీ సి.పి. రాంబాబు, పర్యవేక్షక ఇంజినీరు కె.వి.ఎన్. రవి, డి.ఇ.ఒ. శ్రీనివాస రావు డి.పి.ఓలు తదితరులు పాల్గొన్నారు.



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకున్న బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, కోచ్ పుల్లెల గోపీచంద్‌ను మంత్రి శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు. అనంతరం పుల్లెల గోపీచంద్ అకాడమీలో బీఏఐ సిరీస్ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు.

# అంతర్ విశ్వవిద్యాలయ బాస్కెట్ బాల్ పోటీలకు గీతం జట్టు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : బెంగళూరు లోని క్రిస్ట్ విశ్వవిద్యాలయం వేదికగా డిసెంబర్ 30 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బాస్కెట్ బాల్ పోటీలలో పాల్గొనే గీతం జట్టును ఎంపిక చేసినట్లు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్ కార్తీక్ తెలిపారు. గీతం బాస్కెట్ బాల్ జట్టు కెప్టెన్ గా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థి ఎమ్.జస్వంత్ చౌదరి వ్యవహరిస్తాడని సభ్యులుగా నియాజ్ నబి, ఎమ్.కళ్యాణ్, దేవి గురుదత్, ద్రోణం రాజు వరుణ్, ఆదిత్య సింగ్, సాగిశ్రీ, పి.వైష్ణవ్ కుమార్, బి.శ్రేయాష్ రాథోడ్, కె.ఆశిష్ కుమార్, హరిదేవ రాజన్, బి.ఎస్.ఎస్.వి.మణికంఠ ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. జట్టు మేనేజర్ మరియు కోచ్ గా జి.శ్రీనివాసు వ్యవహరిస్తారని తెలిపారు.

గీతం జట్టు తొలివిడతగా తమిళనాడు కర్పాగం అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జట్టుతో తలపడుతుందన్నారు.

# ఉత్సాహంగా సాగుతున్న వైఎస్ఆర్ క్రికెట్ కప్ పోటీలు

- 5 రోజుల్లో 280 మ్యాచ్ లు విజయవంతంగా పూర్తి




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రదాన కార్యదర్శి విజయసాయి రెడ్డి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్ ఆర్ కప్ క్రికెట్ పోటీలు ఈ నెల 21 న పోర్టు స్టేడియంలో అంగరంగ వైభవంగా ప్రారంభంచిన నాటి నుంచి ఉత్సాహంగా సాగుతున్నాయి. విశాఖ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని, విశాఖపట్నం పరిపాలనా రాజధానితో పాటు క్రీడారాజధాని కూడా కావాలని ప్రతిష్టాత్మక వైఎస్ ఆర్ క్రికెట్ కప్ పేరిట నిర్వహిస్తున్న టోర్నీలో నగరంరలోని 98 వార్డులనుండి 7840 పైచిలుకు క్రీడాకారులను బాగస్వాములు చేసారు. ఆంధ్ర యూనివర్శిటీ పిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ సాంకేతిక సహకారంతో వివిధ ప్రాంతాలకు చెందిన మెత్తం 14 గ్రౌండులలో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఒక్కో గ్రౌండులో రోజుకు నాలుగు మ్యాచ్ లు చొప్పున మెత్తం రోజుకు 56 మ్యాచ్ లు విజయవంతంగా ముగుస్తున్నాయి. ఐదు రోజులలో మెత్తం 280 మ్యాచ్ లు దిగ్విజయంగా ముగిసాయి. ఆంధ్రా యూనివర్శిటీకి చెందిన 60 మంది ఎంపీఈడి (మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ) విద్యార్థులు మెత్తం 14 గ్రౌండులలో నిర్వహిస్తున్న క్రికెట్ మ్యాచ్ లకు టెక్నికల్ ఇన్చార్జిలుగా వ్యవహరిస్తున్నారు.

నిర్వాహక బృందం సభ్యులు ఆంధ్ర యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ ఛీఫ్ ప్రొఫెసర్ విజయ్ మోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓడి డాక్టర్ పల్లవి, జేమ్స్ స్టీఫెన్, లక్ష్మణ్ లు మెత్తం 14 గ్రౌండులను సందర్శిస్తూ గ్రౌండ్ ఇన్చార్జిలకు సూచనలు సలహాలు అందిస్తున్నారు. మరోవైపు వార్డు కార్పోరేటర్లు, వార్డు అధ్యక్షులు క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ మ్యాచ్ అనంతరం బహుమతులు, షీల్డులు అందిస్తున్నారు. సోమవారం నాడు నిర్వాహక బృదం సభ్యులు ఆంధ్ర మెడికల్ కాలేజీ గ్రౌండు, ఏయలోని మెత్తం నాలగు గ్రౌండులు, పోర్టు స్టేడియం గ్రౌండు సందర్శించడంతో పాటు ఏయు లో ఇంజనీరింగ్ కాలేజ్ లో మూడు గ్రౌండులలో జరిగిన మెదటి మూడు మ్యాచ్ లకు టాస్ ను నిర్వహించారు.

71 వ వార్డు కార్పోరేటర్ రాజాన రామారావు, 76 వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ లు ఆ వార్డు పరిధిలో జరిగిన మ్యాచ్ ల విజేతలకు బహుమతులు అందజేసారు. ఓటమి చెందిన టీంకు టోర్నీ గుర్తుగా మెడల్స్ అందజేసారు. ఫిష్ యార్డ్ గ్రౌండులో జరిగిన మ్యాచ్ లలో విజేతలకు వైకాపా జిల్లా సెక్రటరీ బొడ్డ గోవింద్, వార్డు ప్రెసిడెంట్ చిత్రాడ వెంకటరమణ లు బహుమతులు అందజేసారు. 15 వ వార్డునుండి విజయం సాధించిన ఎస్ వి వైసి, ఎస్ ఆర్ కే టీంలను కార్పోరేటర్ అప్పారి శ్రీవిధ్య అభినందించారు. వార్డు ప్రెసిడెంట్ పీలా వెంకట్ నాయుడు, నరాల సత్తిబాబు, ఇతర నాయకుడు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com